ఆదివారం

ప్రజాశక్తి

మార్చి 13, 2005

కథా నిలయం

సాగిపో
ఛావెజ్
మేమూ నీతోనే...

హ్యాపీ బర్త్‌డే

13.3.2005 నుంచి
19.3.2005 వరకు

వైష్ణవీ సింధు
5సం॥, 13.3.2000
అమ్మాజీ-అజయ్
గాంధీనగర్-విజయవాడ



నందిని
1సం॥,మార్చి-2004
భారతి-జానకిరాం నాయక్
వనపర్తి-మ॥నగర్

వైష్ణవి
2సం॥, 15.3.2003
భాగ్యలక్ష్మి-ప్రభాకర్
బెల్లంపల్లి-ఆదిలాబాద్

శేజలు
3సం॥, 15.3.2002
శశికళ-సతీష్
సత్తెనపల్లి-గుంటూరు

నవీన్‌కుమార్
7సం॥, 15.3.1998
లక్ష్మీబాయి-చంద్రశేఖర్
భువనగిరి-నల్లగొండ

చందన
3సం॥, 15.3.2002
సరిత-శ్రీనివాస్
ఆలేరు-నల్లగొండ

కమలకోటేశ్
1సం॥,15.3.2004
సునీత-కోటేశ్
మురారిపల్లి-ప్రకాశం

జోతిర్
1సం॥, 17.3.2004
అనూరాధ-గంగాధర్
సంతపేట-నెల్లూరు

ఆదిత్య శ్రీరాం
1సం॥, 18.3.2004
అంజలి-జనార్థన్
ఎస్పీనగర్-హైదరాబాద్

అరవింద్
1సం॥, మార్చి-2004
కురువమ్మ-నాగరాజు
మైలారం-మ॥నగర్

శృతి
6సం॥, 15.3.1999
అపర్ణ-రాంబాబు
కృష్ణలంక-విజయవాడ

రత్నాకర్‌రెడ్డి
పరిమళ-నారాయణరెడ్డి
నారాయణపేట-మ॥నగర్

మంజూష
6సం॥, మార్చి-1999
జలలక్ష్మి-ప్రసాద్
వించిపేట-విజయవాడ

కీర్తన
2సం॥, మార్చి-2003
గిరిజ-భాస్కర్
ఆటోనగర్-హైదరాబాద్

అస్మా
4సం॥,13.3.2001
ఆలం
పరిగి-రంగారెడ్డి

మనోజ్ఞ
మార్చి-16
లక్ష్మీశ్వరి-వీరాచారి
యర్రగొండపాలెం-ప్రకాశం

జె.సాత్విక్(చింటు)
6సం॥, 18.3.1999
వందన-బాబూరావు
జవహర్‌నగర్-హైదరాబాద్

పూర్ణచంద్రరావు
2సం॥, 19.3.2003
పార్వతి-అప్పారావు
విజయవాడ-కృష్ణా

వందనప్రియ
హైమావతి-హరికృష్ణారెడ్డి
పెనుమూరు-చిత్తూరు

కథా నిలయం

రీడర్స్ మెయిల్

(అనావృతం) ది ఎడిటర్, ప్రజాశక్తి ఆదివారం అనుబంధం



రంగుల జలతారు

27వ తేదీ ఆదివారం అనుబంధంలో కవర్‌స్టోరీగా ప్రచురించిన 'రంగురంగుల మొఘల్-ఎ-ఆజం' మమ్మల్నెంతగానో ఆకట్టుకుంది. ఒకనాటి చిత్రకళాఖండమయిన ఆ సినిమా గుర్తుకువస్తేనే ఒక రకమైన అనుభూతికి లోనౌతాము. అలాంటి చిత్రం రంగుల్లోకి మార్చుకోగలిగాము అని తెలియగానే ఎంతో ఆనందించాం. దాని గురించి చాలా వివరమైన వ్యాసం ప్రచురించిన మీకు మా హృదయపూర్వక ధన్యవాదాలు.

-కె అనంత కేశవులు,
రామచంద్రాపురం, తూర్పుగోదావరి

రంగుల అద్భుతం

మొఘల్-ఎ-ఆజం ఆనాటి మాస్టర్‌పీస్. అది రంగుల అద్భుతంగా మనముందుకు రావడం ఆ చిత్రాభిమానులమైన మనందరికీ సంతోషకరం. దానిని అలా రంగుల్లో తీర్చిదిద్దడంలో గల సాధకబాధకాలను, సాంకేతిక విషయాలను చాలా ఆసక్తికరంగా ప్రచురించడం బాగుంది. అలనాటి మన తెలుగుసినిమాలను కూడా అలా చేస్తే చూడాలనివుంది. కానీ అది చాలా ఖర్చుతో కూడుకున్నదని మనవాళ్ళకు అది అసాధ్యమని ఈ వ్యాసం చదివాక అర్థమయింది. వ్యాసకర్తకు ధన్యవాదాలు.

-సిరిపురపు రామకోటేశ్వరరావు,
ఎనికేపాడు, విజయవాడ రూరల్

కవర్‌స్టోరీ కలర్‌ఫుల్

అందాల మొఘల్-ఎ-ఆజం సినిమా గురించి అంతే అందంగా ముఖచిత్రం వేశారు. మమ్మల్ని ఎంతగానో ఆకట్టుకుంది. ఆ సినిమాలోని పాట 'ప్యార్ కియా తో డర్నా క్యా' అనే పాట ఎంతో ప్రాచుర్యం పొందింది. అలనాటి సినిమా పనితనం అలా శాశ్వితంగా నిలబడిపోయింది. దానిని కలర్‌లోకి మార్చడం ఎంత శ్రమతో కూడుకున్నట్టిదో ఈ వ్యాసం చదివితే తెలిసింది. మంచి కవర్‌స్టోరీ చదివామన్న సంతృప్తి కలిగింది.

-పి రమేష్, కోవెలమూడివారి వీధి,
సూర్యారావుపేట, విజయవాడ

ఫంక్షన్-ఫంక్షన్

ఈ వారం జీవనశైలి శీర్షికలోని వ్యాసం 'ఫంక్షన్-ఫంక్షన్' చాలాబాగా రాశారు. డబ్బున్నవాళ్ళ బర్త్‌డే ఫంక్షన్ ఎంత గ్రాండ్‌గా చేశారో, ఎన్ని లక్షలు ఖర్చుపెట్టారో, ఆ ఆర్భాటాల గురించి విమర్శనాత్మకంగా రాశారు. "మారేకాలపు ఫలసాయం" కథ లో స్నేహబంధానికున్న విలువను చాలా చక్కగా వ్యక్తం చేశారు. రియల్‌స్టోరీలో టీనేజ్ రచయిత అంకిత్ ఎంత పట్టుదలగా రాసిన పుస్తకాన్ని దానిని అంతర్జాతీయ ప్రచురణాసంస్థ మెక్‌మిలన్ పబ్లిషింగ్ సంస్థ అచ్చువేయడం నిజంగా స్ఫూర్తిదాయకంగా ఉంది. మొత్తంగా ఆదివారం అనుబంధంలోని రచనలన్నీ బాగా ఆకట్టుకుంటున్నాయి.

-ఎం లలిత, కంచరాం,
శ్రీకాకుళంజిల్లా

అనుబంధం బాగుంది.

ఆదివారం సంచికలలో ప్రచురిస్తున్న కవర్‌స్టోరీలు, కథలు, రియల్‌స్టోరీలు, వ్యాధులు-వాటి నివారణలు గురించి రాస్తున్న అంశాలన్ని చాలా బాగుంటున్నాయి. అందుకే ప్రజాశక్తి దినపత్రికనే కొంటున్నాను. ఇంకా మంచి స్టోరీలు అందించాలని కోరుకుంటున్నాను.

పి విలియం కేరి, ఎంఆర్‌పి,
పాడేరు మండలం, విశాఖజిల్లా.

కథా 'శక్తి'

ఈ వారం బాలలకథ "తల్లిచేసిన తప్పు" కథ కనువిప్పుగా వుంది. చిన్నదైనా పెద్దదైనా తప్పుతప్పే. కుండకు బెజ్జం చిన్నదైనా పెద్దదైనా నీళ్లు అన్నీ పోతాయి. అలాగే పిల్లలు చిన్ననాడే చేసే తప్పులు అన్నీ తెలిసిన తల్లిదండ్రులు సరిచేయాలి. ఈ ఆధునిక యుగంలో తమ పిల్లలకు మంచి మంచి కథలు చెప్పడం లేదు. ఆ మంచి పనిని ఆదివారం ప్రజాశక్తి తన భుజాలమీదికి ఎత్తుకున్నది. దానికి మా కృతజ్ఞతలు. ఇలాగే ఎన్నో మంచి కథలు రావాలని ఆశిస్తూ.

పెందోట వెంకటేశ్వర్లు,
మక్తలక్ష్మాపూర్. జి.మెదక్

బాలలకూ పెద్దలకూ నీతికథ

ఆదివారం అనుబంధంలోని బాలలకథ 'తల్లి చేసిన తప్పు' పిల్లలకే కాదు పెద్దలకూ కూడా కనువిప్పు. అది ఒకనాటి కథలాగా మా చిన్నప్పుడు విన్నట్టు అనిపించినా ఈ కాలానికి అనుగుణంగా మార్చి ఈనాటి బాలబాలికలకోసం వేయడం బాగుంది.

బాసంగి సత్యనారాయణ,
మల్కీపురం, విశాఖజిల్లా

హై హై ఏలికా

నాక్కొంచెం నమ్మకమివ్వు
కొండల్ని పిండి చేస్తాను!

అన్నాడు కవి. కవులు అతిశయోక్తులుపయోగిస్తారేమోగాని అబద్ధాలు చెప్పరు గదా!

పైగా కొండల్ని పచ్చడి చేసేందుకు కవిగారు మనల్ని ఆర్థికసాయం అడిగేరా? లేదు! అంగబలం కావలన్నారా? లేదు!

సొంతకష్టంతో కొండల్ని చితగ్గొడతానంటున్నారు!

కాకపోతే... కొంచెం నమ్మకమివ్వమని అర్థించేరు అంతే!

అంతే కదా? అదికూడా తప్పేనా? నువ్వు సామాన్యుడివి కావు భాబూ అని గుర్తుచేయడం వల్లనే కదా అలనాడు హనుమంతుడు సముద్రమ్మీద ఎగిరి లంకలో కాలు పెట్టేడు!

'సైకిలు తొక్కితే కాళ్లు విరగ్గొట్టుకుంటావు చిట్టీ' అని మన చిన్నతనంలో మన పెద్దవాళ్లు మనకి పిరికి మందు నూరిపోసి ఇంట్లో కూచోబెడితే ఇవాళ ఇన్ని స్కూటర్లు... కార్లూ... రైళ్లూ... విమానాలు నడుపుతూ సుఖపడేవాళ్లమా?

అంచేత– ఎప్పటికప్పుడు ఎవర్నో ఒకర్ని ప్రోత్సహిస్తూ వుండాలి. లేకపోతే లోకకళ్యాణం ఆగిపోతుంది!

అందునా సాక్షాత్తు ఏలికలే ప్రోత్సహిస్తే సామాన్యుని ఉత్సాహం ఉరకలు వేయదూ?

ఇది 'మంచి' అది 'చెడు' అని తెలుసుకోగల మనిషి సైతం ఏలికల ప్రోత్సాహంతో మందుతల్లికి ముద్దుబిడ్డగా ముద్ర వేయించు కుంటాడు!

చీకటిపడితే దిగులవుతాది!
చీకటిపడితే గుబులవుతాది!

అని విషాదంగా పాడుకోడం అలవాటు చేసుకుంటాడు... కూడదు కూడదనుకుంటూనే కూడని పని చేస్తుంటాడు!

అయ్యోపాపం చెడిపోతున్నానని కృంగిపోతుంటాడు!

యావన్మందీ సుఖంగా వుంటే ఏలికలకు తలనొప్పులుండవు. ప్రజలు కష్టకాలంలో బతుకుతున్నప్పుడు – ఏలికలు సుఖపడలేరు!

స్పృహలో వున్న మనిషికి మాత్రమే కష్టసుఖాలు తెలుస్తుంటాయి. అంచేత –

'తాగుతా నీ యవ్వ తాగుతా'నని ప్రజలచేత ప్రతిజ్ఞ చేయించాలి. అందుకు అన్ని విధాలా అనుకూలమైన వాతావరణం అందుబాటులో వుంచాలి!

అంతేకదా?

షై... షై... నాయికా... షై...షై

✣

ఈ సంచికలో . . .

ఓరా! ...	3
కార్టూన్ కదంబం... ...	4
కవర్ స్టోరీ ...	5
జీవనశైలి ...	10
బాలల కథ ...	11
బాలనేస్తాలు ...	12
ఇంతి సంగతి ...	16
నువ్వుద్ది ...	17
ఆరోగ్యం ...	18
పుస్తక పరిచయం ...	21
న్యాయసలహాలు ...	24

ఇంకా...

కలర్ టీ.వి. యింట్లెకొచ్చి...

కథ ... 8, 9

ప్రత్యక్ష దైవాలు

రియల్ స్టోరీ ... 14, 15



కోరుకొండ - పాండవులమెట్ట

టూరిస్ట్ గైడ్ . . . 21

రాయప్రోలు సుబ్బారావు

కళాసాహితి . . . 22, 23

హెచెమ్టీ వారి "సీయమ్టీ" వాచీలు

ఇటీవలే మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీ భవనప్రాంగణంలోని 'హెచ్ ఎం టి షోరూమ్' కిటకిటలాడింది. వాచీల కోసం కోసెడంత లైను కట్టారు సదరు ముఖ్యమంత్రివరేణ్యుల అనుకూల గణం. హెచ్ ఎం టి వారు కొత్త సియం రాజశేఖరుడి ముఖారవిందాన్ని డయల్‌గా అలంకరించిన వాచీలను సరికొత్త ప్రోడక్ట్‌గా అసెంబ్లీ మార్కెట్టులో పెట్టారు. పెట్టిందే తడవుగా ఒక వీరభక్త రాజశేఖరం "మా కార్యకర్తల మణికట్టులపై టిక్‌టాక్‌మంటూ సమయాన్ని నిర్దేశించే సియం వాచీలొక ఐదొందలు ప్యాక్ చేసివ్వయ్యా" అని ఆర్డరు పారేశాట్ట! వైయ్యస్సార్ వాచీలు పెట్టుకున్నవారు హెచ్ ఎం టి వాచీ అని, సి యం టి వాచీ అని తెగ మురిసిపోతున్నారులేండి. హిజ్ మాస్టర్ టైమ్, చీఫ్ మినిస్టర్స్ టైమ్ అని ఆ మురిపెం వెనుకున్న పిసిసి కార్యాలయపు జోకార్థములు.

పబ్లిషరుడి గుర్తింపు అవార్డు

పుస్తకం రాసి అచ్చొత్తి, బజార్లో పడ్డ పన్నెండేళ్ళకు కూడా అవార్డులు వచ్చును అని "రూపా అండ్ కొ" వారు ఓ కొత్త పద్ధతి చూపించారు. 1993లో ప్రచురించిన పుస్తకాలకు 'గుర్తింపు అవార్డు-2005' గా రెండు పుస్తకాల రచయితలకు ఇచ్చారు కూడా. 'ఇన్‌స్క్రుటబుల్ అమెరికన్స్' పుస్తకం రాసిన అనురాగ్ మాథుర్‌కి ఒకటిన్నర లక్షలు, 'టూ థౌజెండ్ ఫోర్' పుస్తకం రాసినిన చేతన్ భగత్‌కు గుర్తింపు అవార్డుకి తోడుగా లక్ష రూపాయలు నగదు పురస్కారం చేశారు. ఆ పుస్తకాలు ప్రచురించి అమ్మకాలకు పెట్టి పన్నెండేళ్ళు అయ్యాక కూడా అమ్మకాలలో 'బెస్ట్ సెల్లర్ పాయింట్-5'గా ఉండటమనేది అసలు విషయం. ఓ పబ్లిషరు రచయితలకు భలే తాయం ఆశపెడుతున్నాడు కదూ!!!

"ఆడోళ్ళను మేమూ గౌరవిస్తామని రాసుకో"



ఇటీవలే...మన దేశ రాజధానిలోని మందిర్‌మార్గ్ పోలీస్‌స్టేషన్ బాబాయిలు ఓ పన్జేసేశారు! తమ పోలీసు వారోత్సవాలలో భాగంగా 'మహిళలపై నేరాలు-ఘోరాలు' అనే అంశంపై ఫొటో ఎగ్జిబిషన్ పెట్టార్టండి. మహిళల పట్ల మగాళ్ళు... అందులోనూ పోలీసు మగాళ్ళు అనంగానే మా చెడ్డపేరు కదండీ. దాన్ని ఎన్ని రబ్బర్లు పెట్టి రుద్దినా ఆ హింసనచణ చరిత్ర చెరిగిపోవడం లేదట. ఇలాంటి కార్యక్రమాలు ఎట్టేసి తమ మీద పడ్డ తరతరాల మచ్చ కొద్దిగానైనా మాపుకుందావని తెగ ఆశపడిపోయార్టండీ. తీరా ఆ ఎగ్జిబిషన్‌లో పిల్లల చేత క్రేయాన్స్, చార్ కోల్‌తో వేయించిన మధుబాల, ఐశ్వర్యారాయ్‌ల సినీ చిత్రాలబొమ్మలను పెట్టించారు. ఎంత అట్టహాసంగా ఆ చిత్రకళా ప్రదర్శన ప్రారంభోత్సవం చేసినా...కొద్దిసేపటికే జనం పలుచబడిపోయారుటండీ. ఆ చికాకులో ఉండగా ఓ పత్రికా ఫొటోగ్రాఫర్ తన కెమేరా క్లిక్‌మనిపించడానికి ఫోజు కొట్టమన్నాట్ట. కొట్టినట్టే పెట్టాడు ఫోజు జనం రాలేదనే కస్సుతో!!

కార్టూన్ కదంబం



టోపీ బాగుందా? నీకూ పెడతానేం!
వైయస్
ఉచిత విద్యుత్‌కు ప్రపంచ బ్యాంకు వ్యతిరేకం: వైయస్
నారు



హమ్మయ్య, నీ వల్లనే ముఖ్యమంత్రినయ్యా! అందుకే నీ దగ్గరికి వచ్చే అవకాశం లభించింది!!
పాదయాత్ర ముగించిన స్థలం వద్ద ఏర్పాటు చేసిన స్థూపాన్ని సందర్శించిన వైయస్
ప్రజా ప్రస్థానం



మా ఆయన నీళ్ళు తేవడానికి బావిలోకి నిన్న వెళ్లాడు
167 మండలాల్లో అడుగంటిన భూగర్భ జలాలు

సాగిపో ఛావెజ్ మేమూ నీతోనే



ఎం. కోటేశ్వరరావు

**ఆయనో మిలిటరీ అధికారి... నియంత కాదు.
పెట్టిబడిదారూ కాదు... సోషలిజం పట్ల అచంచల విశ్వాసం ప్రకటించిన వ్యక్తి.
కమ్యూనిస్టు కాదు... కానీ శత్రువులు 'మరో ఫైడెల్ కాస్ట్రో' అన్నారు.
అమెరికా పెరటిలో ఉన్నారు... అయితేనేం 'ఖబడ్దార్ బుష్' అనే కలేజా ఉంది.
ఇంతకీ ఆయనెవరో తెలుసా...వెనిజులా అధ్యక్షుడు విక్టర్ హ్యూగో ఛావెజ్.
ఇంతకూ ఆయన కమ్యూనిస్టు కానపుడు అమెరికన్ పాలకులకు ఆయనన్నా, ఆయనకు
అమెరికన్ పాలకులన్నా ఎందుకంత కోపం అన్న సందేహం మీకు కలుగుతోంది కదూ?**

లాటిన్ అమెరికా ఖండాన్ని అమెరికా తన పెరటి తోట అనుకుంటోంది. ఏ మొక్కను ఉంచాలో దేనిని తుంచాలో ఎవరి పెరటితోటలో వారిష్టం. కాని అమెరికా అక్కడి దేశాలలో ఎవరిని గద్దెనెక్కించాలో ఎవరిని దించాలో ఇంతకాలంగా నిర్ణయిస్తూ వస్తోంది. దాని నిర్ణయాల ప్రకారమే పచ్చి నియంతల పాలనలో ఆ దేశాల జనం మగ్గారు. ఉదయం లేస్తే ప్రజాస్వామ్యం గురించి ప్రవచనాలు పలికే అమెరికన్లు లాటిన్ అమెరికాలో నియంతలను సమర్థించే పరిస్థితులు అంతం కావటంతో ప్రజాస్వామ్య ముసుగులో తన తొత్తులను గద్దెనెక్కించే ప్రక్రియను చేపట్టారు. జనానికి ఓటేసే అవకాశం ఇచ్చిన తరువాత అన్ని చోట్లా అలాంటి తొత్తులను గెలిపించటం వారికి సాధ్యం కావటం లేదు. అదిగో అలాంటిదే వెనిజులా. ఇంతకాలం ఆ ప్రాంత దేశాలలో అమెరికా వ్యతిరేక ఛాంపియన్‌గా నీరాజనాలందుకున్న ఛావెజ్ ఇప్పుడు ప్రపంచమంతటా సామ్రాజ్యవ్యతిరేక శక్తులకు ఒక ఉత్తేజకుడిగా మారారు. వెనిజులాలో గత కొద్ది సంవత్సరాలుగా జరిగిన అంతర్గత పరిణామాలే ఆయనకు అంతర్జాతీయ ఖ్యాతిని తెచ్చాయి. అమెరికా ప్రభావంలో ఉండే ప్రచార సాధనాలు అక్కడి పరిణామాలను ఎంతగా తొక్కిపెడితే అంతగా ఆయన ప్రాచుర్యం పొందారంటే అతిశయోక్తి కాదు. అలాంటి ఛావెజ్ మన దేశంతో సంబంధాలను నెరపుకోవాలని ఎంతోకాలంగా చూస్తున్నారు. ఆయనతో కరచాలనం చేస్తే అమెరికాకు ఎక్కడ కోపం వస్తుందో అని సంఘపరివార్(బిజెపి) నాయకత్వంలోని ఎన్‌డిఏ ప్రభుత్వం పడనివ్వలేదు. మారిన పరిస్థితులలో ఈ నెల నాలుగు నుండి మూడు రోజుల పాటు మనదేశంలో పర్యటించారు. కొల్‌కతాలో వామపక్ష సంఘటన ఆయనకు ఘనమైన అభినందన సభ కూడా ఏర్పాటు చేసింది. ఢిల్లీ, కొల్‌కతా, బెంగుళూరు నగరాలలో అధికారిక పర్యటన చేశారు.

ఆయిల్ అంటే ఎంత తీపి?!

ప్రపంచంలో ఇంధనం ఉత్పత్తి దేశాలలో రోజుకు 30లక్షల పీపాలను వెలికి తీస్తూ ఐదవ స్థానంలో ఉన్న వెనిజులా అధినేత ఛావెజ్. 'మేం అమెరికాకు ఇంధనం అమ్మకాలను కొనసాగించాలనుకుంటున్నాం. అయితే ఇరాక్ మాదిరి మా దేశాన్ని అక్రమించుకో చూస్తే వారికి చుక్క ఆయిల్ దొరకదని గ్రహించాలి. ఇరాక్‌లో ఏమైందో చూడండి. అక్కడి ఆయిల్ సంపదలను స్వంతం చేసుకోగలమనే ఆలోచనతో వెళ్లారు. వాళ్లు ఇరాక్‌ను ఏ నాటికీ తమ అదుపులోకి తెచ్చుకోలేరని నేను స్పష్టంగా చెప్పగలను.' అని బెంగుళూరులో చెప్పారు. అంత ఇంధన సంపదలున్న దేశంలో జనజీవితం ఎలా ఉంటుందన్నది ఎవరికైనా ఆసక్తి కలిగిస్తుంది కదా.

దేశంలోని 60శాతం సాగు భూమి కేవలం రెండు శాతం మంది చేతిలో కేంద్రీకృతం అయింది.

పెట్రోడాలర్లతో విలాసాలలో మునిగిన రాజకీయ నాయకత్వం, ఉన్నతాధికారులు వ్యవసాయాన్ని నిర్లక్ష్యం చేశారు.

జనాభాకు అవసరమైన 70శాతం ఆహారాన్ని దిగుమతి చేసుకోవాల్సి వచ్చింది.

పెట్రోడాలర్లు కొందరికే పరిమితం కావటంతో జనాభాలో 80శాతం మంది దారిద్ర్యరేఖకు దిగువకు వెళ్లారు.

ఈ అసమానతలకు తోడు అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ, ప్రపంచబ్యాంక్ సంస్కరణల పేరుతో సామాన్య జనజీవితాన్ని మరింత చిన్నాభిన్నం చేశాయి.

ఛావెజ్ - ఓ ఛాలెంజ్

ఆ స్థితిలో మిలిటరీలో ప్రజల గురించి ఆలోచించే ఛావెజ్ లాంటి వాళ్ళు తిరుగుబాటు చేసి అధికారంలో ఉన్న ప్రభుత్వాన్ని కూలదోయాలని నిర్ణయించి 1992లో అంతపనీ చేశారు. అయితే అందుకు తగిన పూర్తి సన్నాహాలతో జనాన్ని

> *'దారిద్ర్యాన్ని తొలగించాలంటే సోషలిజం మాత్రమే అనుమతిస్తుందనటంలో నాకెలాంటి సందేహం లేదు. పెట్టుబడిదారీ విధానంలో పేదరికం, దారిద్ర్యం, అసమానతలు తొలగటం అసాధ్యం. అయితే పాత తరహా సోషలిజాన్ని అన్వయించటం గాకుండా 21వ శతాబ్దానికి అవసరమైన సోషలిజాన్ని కనుగొనాల్సిన అవసరం ఉంది.'*
>
> \- హ్యూగో ఛావెజ్



వెనిజులా! వెనిజులా!

వెనిజులా! వెనిజులా!
వర్తమాన ప్రాపంచిక శిఖల మీద వికసించిన
ఎర్రమందారమా!
నిరాశామయ చరిత్ర చీకటిలో వెలిగిన ప్రభాత
కిరణమా!
మొక్కవోని నీ ఆత్మ స్థయిర్యానికి వందనాలు
అలుపెరుగని నీ ప్రతిఘటనా పోరాటానికి వందనాలు
నిఖిల లోకపు పీడిత తాడిత జనావళి తరఫున
విప్లవాభివందనాలు
అసమాన పోరాటయోధుడు ఛావెజ్‌ని కన్నందుకు
వందనాలు
నీ బిడ్డ హ్యూగో ఛావెజ్ ఒంటరి కాదు
'అనకొండ' మీద దండయాత్రకు నీతోనే మేమంతా
సమస్త శ్రమప్రపంచమంతా నీతోనే...

— డా॥ కె లింగారెడ్డి

కూడగట్టకపోవటంతో అది విఫలం అయింది. తిరుగుబాటుకు నాయకత్వం వహించిన ఛావెజ్ ఆ సమయంలో వెలుగులోకి వచ్చి సామాన్య జన హీరో అయ్యారు. రెండేళ్ల జైలుశిక్ష అనంతరం బయటకు వచ్చి జనాన్ని సమీకరించటం ప్రారంభించి 1998 డిసెంబర్‌లో అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. అప్పటి నుండి ఆయనను కూలదోయటానికి శత్రువులు ప్రయత్నించిన ప్రతిసారీ విజయుడై మరింత సంఘటితశక్తితో బలోపేతుడౌతున్నారు. ప్రత్యర్థులు ప్రభుత్వరంగంలో ఇంధన పరిశ్రమలో సమ్మె చేయించారు. ప్రయివేటు పరిశ్రమల వారిచేత సామూహిక లాకౌట్‌లు నెలల తరబడి ప్రకటింప చేశారు. తప్పుడు సంతకాలతో రిఫరెండాలకు పూనుకున్నారు. చివరకు ఆయనను కిడ్నాప్ చేసి రాజీనామే చేసినట్లు ప్రచారం చేశారు. అన్నింటినీ జనం వమ్ము చేశారు. కొద్దికాలంలోనే ఛావెజ్ అంతటి ప్రజాభిమానాన్ని ఎలా చూరగొన్నారన్నది కూడా ఆసక్తికరమే.

భూమిని పేదోళ్ళ బువ్వగా చేస్తే...

సారవంతమైన భూమి ఉన్నా ఆహారదిగుమతులు చేసుకోవటం ఏమిటన్నది ఆయనకు వచ్చిన తొలి ఆలోచన. అందుకు భూసంస్కరణలే ఏకైక మార్గమన్నది ప్రపంచానుభవం. అయితే గతంలో గౌతమాలా, చిలీ, చివరికి వెనిజులాలో కూడా భూసంస్కరణలకు పూనుకున్నవారిని ప్రతీపశక్తులు సహించలేదు. అందువలన ఆయన ముందు ప్రభుత్వ భూములను పంచేందుకు పూనుకున్నారు. వ్యక్తులు, సహకార సంస్థలకు అందుబాటులో ఉన్న 22లక్షల హెక్టార్ల భూములను పంచారు. ఎవరైనా ఖాళీగా భూములను ఉంచితే పన్ను వేస్తామని ప్రకటించారు. రెండవ చర్యగా ప్రభుత్వ భూములను ఎవరు ఆక్రమించుకున్నారో, కొంతమందికి ఐదువేల ఎకరాలకు పైగా భూమి ఎలా వచ్చిందో నిగ్గుదేల్చేందుకు జాతీయ భూమి సంస్థను ఏర్పాటు చేశారు. అది ఈ ఏడాది జనవరిలో తన పని ప్రారంభించింది. సర్వేయర్లు కొన్ని ఎస్టేట్లకు వెళ్లారో లేదో ఇంకేముంది ఛావెజ్ ప్రయివేటు భూములను ఆక్రమించుకుంటున్నారని ఆయన వ్యతిరేక మీడియా ముఖ్యంగా అమెరికా, బ్రిటన్‌లోని లోని బడా పత్రికలు ప్రచారం ప్రారంభించాయి. అదిగో పులి అంటే ఇదిగో తోక అని చెప్పేవారి గురించే ఇంతవరకు విన్నాం. వెనిజులా విషయంలో అదిగో పులి అనకుండానే తోకెలా ఉందో మీడియాలో కథనాలు వచ్చాయి. న్యూయార్క్‌టైమ్స్ పత్రిక 66లక్షల హెక్టార్ల ప్రయివేటు భూమి స్వాధీనానికి పూనుకుందని రాసింది. క్రిస్టియన్ సైన్స్ మానిటర్ అనే పత్రిక కేవలం ప్రయివేటు భూములపైనే కేంద్రీకరించినట్లు పచ్చి అవాస్తవాన్ని ప్రచారంలో పెట్టింది. అదిగో కాస్ట్రో భక్తుడు చావెజ్ ఇప్పుడు ప్రవేటు ఆస్థుల మీద కన్నేశాడని వాషింగ్టన్ పోస్ట్ పత్రిక పేర్కొన్నది. కార్లోస్‌బాల్ అనే ఒక రాతగాడు ప్రయివేటు ఆస్తి ఇక గత కాలపు చరిత్రగా మారుతోందని వర్ణించారు. లండన్ నుండి వెలువడే ఫైనాన్సియల్ టైమ్స్ (మనదేశంలో బిజినెస్ స్టాండర్డ్‌తో భాగస్వామిగా చేరింది) మూడేండ్లుగా కేవలం కాగితాలకే పరిమితమైన ఛావెజ్ ఇప్పుడు అమలుకు పూనుకున్నాడని ఆరోపించింది. (నిజానికి మూడేండ్లుగా ప్రభుత్వ భూములు పంచారు)



బుష్‌కు ఓటువేయద్దని స్పానిష్ భాషలో పోస్టర్

ఇదంతా ఒక్క ఎకరం కూడా ప్రయివేటు భూమిని స్వాధీనం చేసుకోవాలన్న నిర్ణయం చేయకముందే అన్నది నమ్మలేని నిజం. అక్కడి భూస్వాములు, ఎస్టేట్లు ఎంత పెద్దవంటే గొడ్డు మాంసానికి అవసరమైన పశువులను పెంచేందుకు బ్రిటన్‌కు చెందిన వెస్టీ సంస్థ 32వేల ఎకరాలను గడ్డికోసం కేటాయించింది. ప్రభుత్వ భూములను పంచినందుకు పెట్టుబడిదారులు నిజానికి ఇంతగా గగ్గోలు పెట్టాల్సిన అవసరం లేదు. ఇప్పుడు చావెజ్ లక్షా 30వేల కుటుంబాలకే భూమి పంచారు. అంతకు ముందు అంటే 1960 దశకంలో అదే వెనిజులాలో లక్షా50 వేల మందికి ప్రభుత్వం భూములిచ్చింది. అయితే వారికి అవసరమైన పెట్టుబడి లేకపోవటంతో తిరిగి వెస్టేలాంటి సంస్థలకు వాటిని అమ్మివేసుకున్నారు. ఆ అనుభవాన్ని పునరావృతం కానివ్వకుండా ఛావెజ్ చర్యలు తీసుకోవటమే అలాంటి ఎస్టేట్ యజమానుల ఆందోళనకు మూలం. అమెరికాలో అబ్రహాం లింకన్ ఒక భూచట్టం అమలు జరిపారు. దాని ప్రకారం 21 సంవత్సరాలు వచ్చిన ప్రతి వ్యక్తి తనకు 160 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించాలనే హక్కు పొందాడు. అయితే దానిని ఐదు సంవత్సరాలు సాగు చేసి ఎవరికీ తాకట్టు పెట్టకుండా, అమ్మకుండా ఉంటేనే పట్టా హక్కు వస్తుందనే నిబంధన విధించారు. ఛావెజ్ దానిని మూడు సంవత్సరాలుగా నిర్ణయించారు. సాగుకు అవసరమైన రుణ సదుపాయం కలిగించారు. ఇది జనంలో ఎంతో ఆదరణకు భూమి పట్ల ఆసక్తి పెంచటానికి దారి తీసింది. ప్రయివేటు

ఇవీ...వెనిజులా విశేషాలు

వెనిజులా పూర్తి పేరు: బొలివేరియన్ రిపబ్లిక్ ఆఫ్ వెనిజులా
అధికార భాష : స్పానిష్
ఖండం : దక్షిణ అమెరికా(లాటిన్ అమెరికా)
సరిహద్దులు: పశ్చిమం: కొలంబియా, దక్షిణం: బ్రెజిల్, తూర్పు: గుయానా, ఉత్తరం: కరీబియన్ సముద్రం
పతాకం: పసుపు, నీలి, ఎరుపు రంగుల పై ఏడు నక్షత్రాలు. స్పెయిన్ నుండి స్వాతంత్ర్యం కోరుతూ 1800 సంవత్సరాలలో ఉద్యమకారుడు ఫ్రాన్సిస్‌కో డి మిరాండా దీనిని రూపొందించారు. పసుపు దేశంలోని బంగారానికి చిహ్నంగా, నీలి రంగు స్పెయిన్‌లో తాము భాగం కాదనే తిరస్కార సూచికగా, ఎరుపు రంగును స్వాతంత్ర్యం కోసం రక్తం ధారపోస్తామనే దీక్ష వెల్లడికి వినియోగించారు. దేశంలోని ఏడు ప్రాంతాలకు చిహ్నాలుగా ఏడు నక్షత్రాలను జెండాపై ఏర్పాటు చేశారు. దానిపై అధికారిక చిహ్నం 1810 ఏప్రిల్ పదవతేదీ స్వాతంత్ర్యదినం, 1859 ఫిబ్రవరి 20 ఫెడరేషన్ యుద్ధ తేదీలతో రూపొందించారు.
వైశాల్యం: 916.445 చ.కిమీ, 23 రాష్ట్రాలు, ఒక ఫెడరల్ జిల్లా.
జనాభా: రెండువేల సంవత్సర లెక్కల ప్రకారం 2.34 కోట్ల మంది, 92శాతం రోమన్ కాథలిక్‌లు. జనాభాలో 85శాతం పట్టణాలలో నివశిస్తున్నారు. వారిలో 37శాతం మంది 15 ఏండ్లలోపు వారు, 65శాతం మంది 30 ఏండ్లలోపు వారు. ఇలాంటి నిష్పత్తి ఉన్న కారణంగా జనాభాలో యువకులు ఎక్కువగా ఉన్నారు. జననాల రేటు వెయ్యికి 25.7, శిశుమరణాల సంఖ్య వెయ్యికి 25.7 జనాభా పెరుగుదల రేటు ఎక్కువగా ఉంది. జనాభాలో అధికభాగం వలస వచ్చిన వారే. స్థానికులైన రెడ్ ఇండియన్లు జనాభాలో కేవలం రెండుశాతమే ఉన్నారు. యూరోపియన్, ఆఫ్రికన్, ఇండియన్ తెగల మిశ్రమ తెగ మెస్టిజో 69శాతం ఉంటారు. శ్వేతజాతీయులు 20, నల్లవారు 9శాతం మంది. ఇంధన సంపదలను వెలికి తీసిన తరువాత 1948 నుండి స్పెయిన్, ఇటలీ, పోర్చుగల్ నుండి దాదాపు పదిలక్షల మంది వలస వచ్చారు. పదేండ్ల తరువాత జనాభా ఎక్కువ మంది పట్టణాలకు వెళ్లి పోవటంతో వలస వచ్చిన కొలంబియన్లతో గ్రామాలు నిండిపోయాయి. అర్జెంటీనా, చిలీ, ఉరుగ్వేల నుండి అనేకమంది మేధావులు కూడా వలస వచ్చిన వారిలో ఉన్నారు. తరువాత కాలంలో వలసలు తగ్గిపోయి కొలంబియా, ఈక్వెడార్, పెరూల నుండి వచ్చే వారికే పరిమితం అయింది.
రాజధాని: కారకాస్ జనాభా 18,22,465 ఇతర ప్రధాన పట్టణాలు మరాకైబో, వెలెనేసియా, బార్‌క్విసిమెటో, సిడాడ్ గుయానా.

భూములను కూడా పరిమితం చేసి పంచాలనే డిమాండ్ ముందుకు వస్తున్నది. గత ఏడాది ఛావెజ్‌ను మూడు రోజుల పాటు కిడ్నాప్ చేస్తే జనం లక్షలాది మంది వీధులలోకి వచ్చారు. గ్రామీణులకు కొంతమేరకు భూములు వచ్చాయి కనుక వారు ఆయనకు మద్దతు తెలపటం సహజం. మరి నూటికి 85శాతంగా ఉన్న పట్టణ పేదలు కూడా ఎందుకు లక్షల సంఖ్యలో కదలి వచ్చి ఆయనను తిరిగి గద్దెనెక్కించారు?

గ్రామ-పట్టణ ప్రజల హీరో ఈ హ్యూగో

ఛావెజ్ నమ్మిన బొలివేరియన్ సామాజిక విప్లవంలో భాగంగా ప్రజల భాగస్వామ్య బృందాలను ఏర్పాటు చేశారు. పదిహేను నుండి 30 మంది వరకు సభ్యులుండే ఈ బృందాలు స్థానిక స్థాయినుండి రాష్ట్రం వరకు ఏర్పడ్డాయి. ప్రతి ప్రభుత్వ కార్యక్రమాన్ని ఇవి పర్యవేక్షిస్తాయి. సరిగా అమలు జరపకపోతే పై కమిటీకి ఫిర్యాదు చేయటంతో పాటు ఎందుకు అమలు జరపలేదని నిలదీసే హక్కు ఉంది. అవసరమైతే ఆందోళనకు దిగుతాయి. ఇలాంటి బృందాల ఏర్పాటు ఒక మహత్తర ఉద్యమంగా, ఒక సామాజిక కార్యక్రమంగా సాగింది. ఒక పునాది, దానిపై సంఘటితమైన పార్టీ నిర్మాణం, ఒక చరిత్ర, పూర్వపు సాంప్రదాయం లేకపోయినా దిగువ నుండి నిర్మాణమైన ఈ బృందాల కారణంగానే ఛావెజ్ ప్రత్యర్థుల కుట్రలనుండి బయట పడటం, ఎన్నికలు, ప్రజాభిప్రాయ సేకరణల్లో విజయం సాధించారని ప్రముఖ సామాజికవేత్త, రచయిత రోలాండ్ డెనిస్ పేర్కొన్నారు. చావెజ్‌ను వెనక్కు రప్పించాలన్న ఒక ప్రజాభిప్రాయసేకరణ నిర్ణయం- ఓటింగ్‌కు మధ్య వ్యవధి కేవలం రెండు నెలలే అయినప్పటికీ ఈ బృందాల సంఘటిత నాయకత్వం కారణంగా అనూహ్యంగా ఛావెజ్ ఒకసామాజిక- రాజకీయ ఉద్యమాన్ని నిర్మించారు. ప్రతిసామాజిక బృందాన్ని ఎన్నికల పోరాట కమిటీలు మార్చివేశారు. ఇవి అవసరమైతే సామాజిక పోరు శాఖలుగా కూడా మారిపోతాయి. అంచెలంచెలుగా వాటినుండి నాయకత్వాన్ని ఎంపిక చేసి కేంద్రకమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీలలో పన్నెండు లక్షల మంది క్రియాశీలక సభ్యులు చేరారు. జనాభాలోని నాలుగుశాతం మంది ఈ కమిటీలలో చురుకుగా పాల్గొంటున్నారు. ఎన్నికలు, తమకు నచ్చిన వారిని ఎన్నుకోవటం, ప్రత్యర్థులు ఆ ప్రభుత్వాన్ని స్వార్థంతో కూల్చివేసేందుకు ప్రయత్నించటం, దానిని కాపాడుకొనేందుకు సామూహికంగా కదలి వీధులలోకి వచ్చే రాజకీయ చురుకుదనం వారందరికీ తొలి అనుభవం.

ప్రత్యామ్నాయ ఛానల్ ప్రసారం

రాజకీయ కుట్రలు, పాలకవర్గ ప్రయోజనాలకు మీడియా ఎలా తోడ్పడుతుందో ఈ కాలంలో వారికి అనుభవంలోకి వచ్చింది. అందుకే వాస్తవ సమాచారాన్ని అందించే ప్రత్యామ్నాయ మీడియా ఏర్పాటుకు కూడా చావెజ్ నడుం కట్టారు. మధ్యప్రాచ్యంలో అల్ జజీరా సామ్రాజ్యవాదుల ప్రచారాన్ని తిప్పి కొడుతూ ప్రత్నామ్నాయ మీడియాగా అచిర కాలంలోనే ఎలా ప్రాచుర్యానికి వచ్చిందో అదే తరహాలో లాటిన్ అమెరికా న్యూస్ ఛానల్ 'టెల్‌సూర్'ను(పేదల టీవీ అనే అర్థంతో పాటు దక్షిణ అమెరికా టీవీ అని కూడా అర్థం వస్తుంది) ఏర్పాటు చేయాలని దానికి స్వతంత్ర ప్రతిపత్తి కల్పించాలని నిర్ణయించారు. ఈ టీవీ ఛానల్‌కు వెనిజులా, అర్జెంటీనా, బ్రెజిల్, ఉరుగ్వే దేశాలు పెట్టుబడి పెడతాయి. వెనిజులా రాజధాని కారకాస్ కేంద్రంగా పని చేస్తుంది. మే నెల నుండి ప్రసారాలు ప్రారంభించే ఈ ఛానల్ ప్రధానంగా అమెరికాలోని సిఎన్‌ఎన్, యూనివిజన్‌లకు దీటుగా ఉండాలని, అభ్యుదయభావాలకు కేంద్రం కావాలని నిర్ణయించారు. ప్రభుత్వ నిధులు కొంతకాలం తరువాత నిలిపివేయబడతాయి. అయితే అవసరమైనపుడు స్పాన్సర్ల ద్వారా, ఇతర మార్గాలలో నిధులు అందచేస్తారు. వాణిజ్య ప్రకటనలు ఉండని ఈ ఛానెల్‌కు ఇప్పటికే పలు దేశాల విమాన సంస్థలు, ఇతర పారిశ్రామిక, వాణిజ్య సంస్థలు స్పాన్సర్స్‌గా ముందుకు వచ్చాయి.

ప్రజాస్వామిక పద్ధతులలో ఎదుర్కోలేని అమెరికా, ఛావెజ్‌ను కిరాయి హంతకుల ద్వారా హత్య చేయించేందుకు వేసిన పథకం బట్టబయలైంది. 'మాపై దురాక్రమణకు దిగితే రగిలే జ్వాల ఒక్క వెనిజులాకే పరిమితం అవుతుందనుకుంటే బుష్ మీరు పొరపాటు పడ్డట్లే, అది యావత్ లాటిన్ అమెరికాకు విస్తరిస్తుంది. అలాంటి దుస్సాహసం చేయవద్దు. ఎందుకంటే తరువాత విచారించాల్సి వస్తుంది.' అని హెచ్చరించారు. 'మాపై దురాక్రమణకు దిగినా, మమ్మల్ని గాయపరచినా వారికి ఇంధన సరఫరా నిలిపివేస్తాం' అని న్యూఢిల్లీలో కూడా ఛావెజ్ అన్నారు. అందుకే ఛావెజ్ ఓ... ఛాలెంజ్. ప్రపంచ షావుకారికి విసిరిన ఛాలెంజ్.

✤

ఛావెజ్ భుజం తట్టిన ప్రపంచం



గత ఏడాది రిఫరెండం సందర్భంగా ఛావెజ్‌కు మద్దతు ప్రకటిస్తూ అమెరికాతో సహా వివిధ దేశాలకు చెందిన రచయితలు, జర్నలిస్టులు ఇతర మేధావులు 76 మంది ఒక ప్రకటన చేశారు. "మేం గనుక వెనిజులా పౌరులం అయి ఉంటే ఛావెజ్‌కు ఓటు చేస్తాం" అన్న ప్రకటన ద్వారా వెనిజులా ప్రజలు ఛావెజ్‌కు మద్దతుగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. మన దేశం నుండి ఆ ప్రకటనపై సంతకం చేసిన వారిలో రచయిత, జర్నలిస్ట్ ఇజాజ్ అహమ్మద్, సోషియాలజిస్ట్ విల్‌ఫ్రెడ్ డి కోస్టా ఉన్నారు.

కలరు టీ.వీ. యింట్లోకొచ్చి...

పుప్పాల కృష్ణమూర్తి

ఉద్యోగరీత్యా కోదాడకు మారాము. ఆవిడ బి.ఇడి. కోచింగ్ తీసుకోవాలని, కంప్యూటర్ నేర్చుకోవాలని, నిర్ణయం తీసుకుంది. నేనడ్డు చెప్పలేదు. ప్రోత్సహించాను కూడా. నన్ను సర్కారు కొలువుకు, పిల్లల్ని ప్రైవేటు బళ్ళకు పంపడానికే ఆమెకు టైము సరిపోయేది. ఇంట్లో అంట్లకు, బట్టలుతకడానికి పనిమనిషిని పెట్టుకోక తప్పనిస్థితి ఏర్పడింది.

మా ఇంటికెదురుగా వున్న రేకుల ఇంట్లో దుర్గయ్య కిరాయికున్నాడు. వాళ్ళది నందిగామ దగ్గర వీర్లపాడట. ఎనిమిదేళ్ళకింద ఆరేళ్ల బాబుతో కోదాడకు వచ్చాడట. మా ఓనర్ వెంకట్రామయ్య గారన్నాడోసారి మాటల సందర్భంలో. అప్పట్నుంచి అదే ఇంట్లో కిరాయికుంటూ, పదిగజాల దూరంలో వున్న మెయిన్‌రోడ్డు పక్కనున్న చింతచెట్టుకింద టేబుల్ వేసుకుని, ఇస్త్రీ చేస్తుండేవాడు. ఆ ప్రాంతం వాళ్ళందరి ఇండ్లకూ తిరిగి, బట్టలు తీసుకెళ్ళేవాడు. చక్కగా యిస్త్రీచేసి, సాయంత్రం శ్రద్ధగా అప్పజెబుతుండేవాడు.

నేను తొమ్మిదింటికి ఆఫీసుకు బయల్దేరేసరికే చింతచెట్టు కింద తలవంచుకుని, బొగ్గులు పోసిన బరువైన ఇత్తడి పెట్టెతో ఇస్త్రీ చేస్తుండేవాడు. పొద్దుగూకాక కాని పెట్టె ఆర్పేవాడుగాదు. నేను యింటికొచ్చాక ఆరున్నర, ఏడుగంటల ప్రాంతంలో బల్ల సర్దేసి, ఇస్త్రీ బట్టలు ఎవరివి వారికి అప్పగిస్తుండేవాడు. రోజుకు వందదాకా సంపాదిస్తుండేవాడు. ఆరొందలు ఇంటి కిరాయి కట్టుకుంటూ, పదివేల చిట్టివేస్తూ, ఉన్నంతలో గుట్టుగా సంసారం చేస్తున్నాడు. పిల్లలిద్దర్నీ మా పిల్లలు చదివే తేజ స్కూల్లోనే ఇంగ్లీషు మీడియం చదివిస్తున్నాడు.

ఓ ఆదివారం ఉదయం పేపర్ చదువుతుంటే పున్నమ్మ వచ్చింది బట్టలకోసం. శాల్తీలు లెక్కేసుకుని "మా ఆయన ఒక్కడు కష్టంజేస్తే బతకడం కష్టంగా ఉందమ్మగారూ. నేనూ ఏదైనా పని చేయాలనుకుంటున్నా" అంది ప్రాధేయ పడుతున్నట్లుగా.

మా ఆవిడ కోచింగ్ వెళ్ళబట్టి వారమౌతుంది. క్లాసులకు, యింటిపనికి టైమేమాత్రం సరిపోవడంలేదు. "మా బట్టలు ఉతుకుతావాచెప్పు. నేను బి.ఇడి. రాయాలి" అంది మా ఆవిడ.

''తప్పకుండా అమ్మగారూ'' అంది ఆనందపడిపోతూ.

"ఎంతిమ్మంటావు చెప్పు" అంది.

''మీ ఇష్టం అమ్మగారూ. మీకు తోచిందివ్వండి" అంది తన ముతకచీరను సర్దుకుంటూ.

"మేమిస్తున్నాం కదండీ నూటాయాభై. మీరూ అలాగే ఇవ్వండి." అంది ఓనర్ పద్మగారు.

"సరే" అని మా ఆవిడ ఒప్పుకుంది. పున్నమ్మదానికే మహానందంగా ముఖం పెట్టింది.

ఉదయం పది గంటలప్పుడొచ్చి, బట్టలుతికి, అంట్లుతోమిపోయేది. మిగిలిన కూరలో, అన్నమో, ఆ రోజు మిగిలిన టిఫినో అప్పుడప్పుడూ మా ఆవిడ యిస్తుండేది. ఒకోసారి మా ఇంట్లోనే తినేసి వెళుతుండేది.

మా క్యాంపస్‌లో వున్న ఐదు కుటుంబాల ఆడవాళ్ళు పని తీరగానే 'టీ'లు తాక్కుంటూ కబుర్లు చెప్పుకునేవారు. అప్పుడు పున్నమ్మ కూడా వస్తుండేది. ఎవరో ఒకరు 'టీ' యిచ్చేవారు. వాళ్ళతో తన కష్టసుఖాలు చెప్పుకుంటుండేది. నేనింటికాడ ఉన్నప్పుడు మాత్రం రాసుకుంటూ, వాళ్ళవైపో చెవిపడేసి వింటుండేవాడ్ని. ఆడవాళ్ళ మాటల్లో నాకు బోల్డుపాయింట్‌లు దొరికేవి కథలకు.

పున్నమ్మ ప్రతిరోజూ రాత్రి తప్పకుండా వచ్చి ముగ్గురు పెళ్ళాల మొగుడి సీరియల్ చూసివెళుతుండేది. ఒకరోజేదన్నా వనుండి రాకపోతే, 'రాత్రి ఏవైందమ్మగారూ'! అని అడుగుతుండేది మా ఆవిడ్ని.

ఓనాడు హఠాత్తుగా అంది "అమ్మగారూ! ఏ టీ.వి. మంచిది" అని.

"ఎందుకూ? కొంటావా?" అంది మా ఆవిడ.

నేను పత్రిక వాళ్ళు పంపిన వీక్లీలో నా కథ చదుకుంటున్నాను.

"పిల్లలు గోల చేస్తుంరు కొనమని. పక్కింటికి పోతుంటే వాళ్ళు విసుక్కుంటున్నారమ్మగారూ. మా ఆయనా తీసుకుందామనే అంటుండు" అంది. మాటల్లో కాస్త దర్పం కనిపించింది ఎంత వినయంగా చెప్పినా.

"రేటును బట్టి ఉంటాయి. టీ.వి. ఎందుకు మీకు. స్వంత ఇల్లంటూ లేదుకదా. ఒక ప్లాటు కొనుక్కోండి. రోజు రోజుకూ రేట్లు పెరిగిపోతున్నాయి. చేతిలో డబ్బు వున్నప్పుడు రెండు గదుల ఇల్లు వేసుకోవచ్చు" అంది మా ఆవిడ. నేనూ వంతపాడాను.

"ఏమో అమ్మగారూ. ఆయన గారు తెద్దామంటుండు. పిల్లలు కూడా పెద్దోళ్ళవుతున్నారు. యింకెప్పుడు అనుభవించేది" అంది మేము చెప్పే సలహా ఇష్టంలేనట్లు.

ఆ మరునాడు షేవింగ్ కోసం షాపుకెళుతూ, దుర్గయ్య కనిపిస్తే కదిలించాను.

"చిట్టిపాడిన డబ్బులున్నాయండి పదివేలు. పోస్టాఫీసులో దాచిపెడదాం. పిల్లల చదువులక్కావాలె అన్నానండి. మా వదిన కొన్నది. నువ్వు టీ.వీ కొంటావా లేదా అని రోజూ నన్ను చంపుకతింటున్నదండీ. అసలు నేను టీ.వి. గాని, సినిమాగాని సూడంగ సూసింరా? తీరికుంటే మంగలషాపు నర్సయ్యతో కబుర్లు పెడతగని" అన్నాడు.

నాకు అర్థమయిందేమిటంటే, పున్నమ్మకే టీ.వీ.కావాలనుంది. భర్తపై నెపం పెడుతోందంతే. ఆ రోజు యింటి కొస్తే మరో మారు చెప్పాను టీ.వీ వల్ల మీకేం ప్రయోజనమూ లేదు అని. కాని అన్యమనస్కంగానే విన్నది.

నాలుగోనాడు హఠాత్తుగా భర్తతో వెళ్ళి కలర్‌టీ.వి. రిక్షా మీంద తీసుకొచ్చింది. ఇరవై ఒక్క ఇంచుల కంపెనీ టీ.వీ. ఆ రోజు సెకండ్ సాటర్‌డే గావడంతో నేను ఇంటిపట్టే వున్నాను. మేము జయలక్ష్మిగారి కుటుంబం వెళ్ళాం చూడ్డానికి, పున్నమ్మవచ్చి పిలిస్తే షాపు నుంచొచ్చిన వర్కర్ ఫిట్‌చేసి వెళ్ళగానే కొబ్బరికాయ కొట్టి భర్తతో టీ.వీ ఆన్ చేయించింది. మాకు బజార్నుంచి తెచ్చిన జిలేబీ పెట్టింది.



'మెచ్చుకోకుంటే బావోదని' తలో ప్రశంసా పలికాము. మా ఆవిడైతే అనేక హెచ్చరికలు చేసి, జాగ్రత్తలు చెప్పింది.

"ఇవ్వాళ్ళ జనానికి తినడానికి తిండిలేకున్నా ఏం బాధ లేదండీ. కంటినిండా వినోదం మాత్రం కావాలి. ఓ రకంగా ఎడిక్టయ్యారు జనం టీ.వీ.కి" అన్నాడు మా పక్క పోర్షన్ కరెంటు ఎ.ఇ. శ్యాంప్రసాద్ గారు ఇంట్లోకొస్తుండగా.

టీ.వీ. వచ్చాక పున్నమ్మలో క్రమేపీ మార్పు కనిపించింది నాకు. గతంలో ముతకచీరలు, మా ఆవిడో, పద్మో యిచ్చిన పాత చీరలు కట్టుకునేది.

ఇప్పుడు అవమానంగా ఫీలవుతోంది కాబోలు కట్టడంలేదు. ఫ్యాన్సీ చీరలు కడుతోంది. పనికివచ్చేప్పుడు పనిమనిషిలాకాక, పేరంటానికెళ్ళే కొత్తపెళ్ళికూతుర్లా తయారై రాసాగింది. గతంలో శ్రద్ధగా సబ్బు పెట్టి బట్టలు ఉతికి ఆరేసేది. ఇప్పుడు సబ్బు పెట్టి వెంటనే నీళ్ళలో ముంచేస్తోంది. మురికేమాత్రం వదలడంలేదు. మా ఆవిడ రెండుసార్లు చూసి కోపగించింది. అయినా పద్ధతి మార్చుకోలేదు. పైగా పిల్లల బట్టలు ఉతికేప్పుడు ఇట్లా మట్లో పొర్లాడితే, ఎట్లా ఉతికేది? మీ పిల్లలకు కాస్త భయం చెప్పండి అని మా పిల్లల పట్ల విసుక్కునేది. అది విని నేను సీరియస్‌గా వార్నింగిచ్చాను... నీకు ఉతకడం కష్టంగా ఉంటే మానుకో. ప్రైమరీస్కూలు కెళ్ళే పిల్లల బట్టలెలా వుంటాయి. ఆడుకోకుండా ఉండరు గదా" అన్నాను. ఇష్టంలేకున్నా తప్పదన్నట్లు, ఈ ఇల్లుపోతే మరోటి దొరకదేమోనని వస్తుండేది.

ఒకనాడు సాయంత్రం మా ఇంటికొచ్చి "అమ్మగారూ! ఒక వెయ్యిరూపాయలుంటే యివ్వరా. చాలా అవసరమున్నయి" రెండ్రోజుల్లో యిచ్చేస్తా... అంది ప్రాధేయపూర్వకంగా.

"నా దగ్గరైతే ఏం లెవ్వు. వారినడిగి చూస్తా... ఏవండీ. పున్నమ్మకో వెయ్యి రూపాయలు కావాలటండి రెండ్రోజుల్లో యిచ్చేస్తుందట" అంది మా ఆవిడ.

'తెలిసిన మనిషేకదా డబ్బులు ఎక్కడికిపోతాయి' అని వెయ్యిచ్చాను వెంటనే. వెళ్ళిపోయింది. "ఎంత అవసరమున్నాయో ఏమో?" అన్నాను మా ఆవిడతో.

"అవసరమా పాడా? ఉదయం టీ.వీ. షాపోడొచ్చి అరిసిపోయాడు. డబ్బులివ్వకుంటే సెట్ ఎత్తుకపోతానని బెదిరించాడు. అందుకే ఈ డబ్బులు" అంది మా ఆవిడ. ఆశ్చర్యపడ్డం నావంతైంది. రెండ్రోజుల్లో ఇస్తానన్న డబ్బులు రెండ్నెల్లయినా యివ్వలేదు. మూడో నెల్లో తెచ్చిచ్చింది. ఆ డబ్బులిచ్చిన పదిహేను రోజులకే "రెండు వేలుంటే యివ్వండి సార్. ఏ నెలకానెల వడ్డీ యిస్తా. అసలు ఏడాదికిస్తా" అందోనాడు. గతంలో నన్ను అయ్యగారనేది. ఇప్పుడు సారంటోంది.

"ప్రస్తుతం నా వద్దలేవు. అదీగాక వడ్డీవ్యాపారం చేయడం నా ప్రవృత్తి కూడా కాదు. చికెన్‌షాపు పక్కనున్న షావుకారి యిస్తాడు అడుగు" అన్నాను.

"ఆయన యివ్వనంటుండు" అని గొణుక్కుంటూ వెళ్ళిపోయింది.

"అతని కాడ అప్పటికే ఐదువేలు తెచ్చిందట. పై బజార్లో చిట్టీలు నడిపే టీచర్ వద్ద ఫైనాన్స్‌కు రెండువేలు తెచ్చిందట'. సాయంత్రం యింటికి రాగానే మా ఆవిడ చెప్పింది.

"ఎందుకిట్లా అప్పులు చేస్తోంది". అన్నాను సాలోచనగా.

"ఏదో షాపింగ్. దానికిప్పుడున్నన్ని చీరలు నాక్కూడా లేవండి. తెగకొంటోంది" అంది. మా ఆవిడ మాటల్లో కాస్త ఈర్ష్య కూడా లేకపోలేదు.

దసరా పండుగరోజు ఉదయమే మెళ్ళో నెక్లెస్ వేసుకుని వచ్చింది. "బాగుందా అమ్మగారూ! ఆరువేలైంది. రెండువేలే కట్టాను. మిగతాది వాయిదాల మీద యిచ్చేట్లు నెలకింతని. మీక్కావాలంటే ఏ నగలైనా అప్పుగా యిస్తాడు. బాగుందా అమ్మగారూ. కండక్టర్‌గారి భార్య బావుందంది. యిప్పుడంతా ఇవే మోడల్స్ చేయించుకుంటున్నారు" అంది.

"ఏవండీ! పున్నమ్మ నక్లెస్ లాంటిది నన్నూ ఓటి చేయించుకోమంటారా"? అంది నవ్వుతూ.

"నీకు ప్రస్తుతమున్న నగలు చాలు. మళ్ళీ కొత్తవెందుకు?" అన్నాను సౌమ్యంగా.

"ఊరికేలెండి" అని "బాగుంది పున్నమ్మా!" అంటూ నగ యిచ్చేసింది. ఆనందంగా వెళ్ళిపోయింది నగ తిరిగి మెళ్ళోపెట్టుకుని.

దుర్గయ్యకు కాస్త దైవభక్తి ఎక్కువే. ప్రతి పండక్కూ భార్యా పిల్లల్తో కలిసి ఊరి వెలుపలున్న రంగని గుడికెళ్ళి కొబ్బరికాయకొట్టి పొలాల మధ్య ప్రశాంత వాతావరణంలో కొద్దిసేపు గడిపి వస్తుండేవాడు. ఇప్పుడు ఏ పండగైనా పున్నమ్మ భర్తతో గుడికెళ్లినట్లు కన్పించడంలేదు. పక్కనో యిద్దరు ఆడ్డవాళ్లని వేసుకుని నీట్‌గా ముస్తాబై సినిమాకెళుతోంది.

గతంలో పిల్లల్ని తెల్లవారుజామున నిద్ర లేపేది పున్నమ్మ. వాళ్ళు ఆరునుంచి ఎనిమిద్దాకా చదూతుంటే వాళ్ళు మార్కులుకూడా 'ఎ' 'బి' గ్రేడ్‌లు వస్తుండేవట. టీ.వీ. వచ్చాక రాత్రి పదకొండుదాకా సినిమా చూసి, ఉదయం ఏడు లోపు లేవడం లేదు. పున్నమ్మ పిల్లల్ని తిట్టడం ఎనిమిదింటప్పుడూ మాకినబడుతుండేది. పిల్లల కండ్లు మండటం, డాక్టర్ వద్దకెళ్ళడం. ఏడాదిలోపే యిద్దరికీ కంటి అద్దాలు వచ్చేయడం జరిగాయి. నేను బట్టల కోసమో, బజార్లో వెళుతూనో వాళ్ళింటివైపు చూస్తే కార్టూన్ ఫిల్మ్‌నో, క్రికెట్టో చూస్తూ కనబడేవారు. వాళ్ళు చూసేప్పుడు తల్లి ఛానల్ మారిస్తే చాలు పోట్లాడేవారు. తండ్రి మారిస్తే పెద్దోడు కిందబడి బోర్లాపడి ఏడ్చేవాడు. వాళ్ళకు టీ.వీ.యాడ్స్, సినిమా డైలాగులు బాగా పట్టుబడ్డాయి. చదువుపై ఇంట్రస్ట్ తగ్గింది. పిల్లలిద్దరూ 'సి' 'డి' గ్రేడుల్లోకి వెళ్ళిపోయారు. ఒకనాడు దుర్గయ్య చెప్పి ఎంత బాధపడ్డాడో...!

దుర్గయ్యకు రాజకీయాలంటే ఆసక్తే. కానీ ఏ పార్టీకి కార్యకర్తగాడు. ఎవరెన్ని చెప్పినా మాత్రం కాంగ్రెస్‌కు తప్ప మరో పార్టీకి వేయడు. టీ.వీ.లో ఏ ప్రోగ్రాం చూసే టైముండేదిగాదు. కాని రాత్రి మాత్రం ఎనిమిదిగంటలకు వార్తలు తప్పకుండా వింటుండేవాడు. తనే ఒకసారి బట్టలు అప్పజెబుతూ చెప్పాడు టీ.వీ. కొన్న కొత్తలో.

పున్నమ్మ సమభావన సంఘంలో చేరింది. తరచుగా మండలాఫీసుకని వెళుతుండేది. తను గ్రూపు లీడరు గావడంతో వెళ్ళక తప్పడంలేదట. ఒకసారి పదివేల రూపాయల లోనొస్తే పున్నమ్మ, సెకండ్‌లీడరు కలిసి పంచుకున్నారట. మిగతా సభ్యులు యింటిమీదికొచ్చి గోల, 'తంతాం' 'ఈడుస్తాం' అని.

పున్నమ్మ సంఘంలో చేరాక పని మానుకుంది. మేము పక్కింటికి వచ్చే పల్లెటూరి పనిమనిషిని, అదే డబ్బులిచ్చేట్లు కుదుర్చుకున్నాం. ఏదో పనుంటే తప్ప ఎక్కువగా మా ఇంటికి రావడం లేదు. దుర్గయ్యే బట్టలు తీసుకెళ్తుండేవాడు.

వాళ్ళింట్లో ఇప్పుడు రోజూ ఏదో ఒక తగాదా అవుతోంది. తల్లి పిల్లలమీద అరవడమో, పిల్లలు తల్లిమీద తిరగబడి కొట్టడమో కన్పిస్తోంది. కిరాణా షాపువాడు, జ్యూయలరీ దుకాణం వాడు, ఎలక్ట్రికల్ షోరూం వాడు, చిట్టీవాడు ఇలా రోజూ ఎవడో ఒకడొచ్చి పున్నమ్మను అరిచి పోతుండేవాళ్ళు. ఆ అవమానాన్ని తట్టుకోలేక, డబ్బు సంపాదించడం చేత కాదని భర్తమీద నోరుచేసుకునేది.

ఒకరోజు రాత్రి ఎనిమిదిగంటల ప్రాంతంలో పున్నమ్మింట్లో పెద్దగా కేకలు వినబడ్డంతో అంతా పరిగెత్తాము. నిలువునా తగలబడిపోతూ, కేకలు వేస్తూ పున్నమ్మ వెలుపలికి పరుగెత్తుకొచ్చింది. దుర్గయ్య అమాంతం వాటేసుకుని కిందపడేసి దొర్లిస్తున్నాడు. అతని బట్టలకూ నిప్పంటుకుంది. నేను వెంటనే దండెం మీది దుప్పటిలాగి పున్నమ్మ మీద కప్పాను. పచ్చిమాంసం కాల్చిన వాసన. ఆ వాసన, కిర్సనాయిల్ వాసన కలిసి కొత్తవాసన వస్తోంది. పిల్లలిద్దరూ హృదయవిదారకంగా ఏడుస్తున్నారు. బజార్లో నిలబడి దుర్గయ్య తలబాదుకుంటూ బోరున విలపిస్తున్నాడు. వెంటనే ఒక ఆటో మాట్లాడి, హాస్పిటల్‌కు తీసుకెళ్ళాము పున్నమ్మ శరీరం యాభైశాతం దాకా కాలింది. బ్రతుకుతుంది కాని రికవరీకి నాలుగు నెల్లయినా పడ్తుంది. దుర్గయ్యకు చేతులు, ఎదుర్రొమ్ము మాత్రమే కాలింది. పెద్ద ప్రమాదమేం లేదు. ఇరవైరోజుల్లో తగ్గిపోతుంది అంది డాక్టర్.

పున్నమ్మ అన్న అంజయ్య రావడంతో మేం ఇండ్లకు మళ్ళాం.

చాలా చిన్న విషయం. మాకు నవ్వొచ్చింది. పున్నమ్మ సీరియల్ చూస్తోందట. భర్తవచ్చి న్యూస్‌కోసం ఛానల్ మార్చారు. కోపంతో రిమోటు లాక్కుని, మళ్ళీ సీరియల్ పెట్టుకుందిట. మాటామాటా పెరిగింది. దుర్గయ్య చెంపమీద కొట్టాడట. వెంటనే ఇంట్లో కిర్సనాయిలు మీద కుమ్మరించుకుని కట్టెల పొయ్యి వద్ద మంటను చీరకు అంటించుకుందిట.

వారం పిదప మా ఆవిడతో వెళ్ళాను చూద్దామని. ఇద్దరూ పక్క పక్క బెడ్లమీదనే పడుకోని వున్నారు. దుర్గయ్య మమ్మల్ని చూడగానే ముఖాన కండువ పెట్టుకుని దుఃఖించసాగాడు. మేమతడ్ని ఓదార్చి, పున్నమ్మ వద్దకెళ్ళాం. ఒంటినిండా కాలిన గాయాలకు మందు రాసివుంది. చూసి చేతులు జోడించింది. ఆమె కళ్ళ నుండి కన్నీరు కారిపోతోంది.

"ఎందుకిట్లా చేశావు పున్నమ్మా' అంది మా ఆవిడ బాధగా.

"ఏదోనమ్మగారూ. నాకు దయ్యం బట్టినట్టైంది. అట్లా చేయాలనిపించింది" అంది మెల్లగా మాటలు కూడ బలుక్కుంటూ.

"ఇప్పటికి ఇరవై ఐదువేలయిందమ్మగారూ, పోలీసులకీ, మందులకి కలిపి తిన్నట్టు లేదాయె. సేసినట్టు లేదాయె. పోరగాల్లు అదురుబొయ్యి నిద్రబోడంలేదు. తిండి సరిగ్గ తింటం లేదు" అంది పున్నమ్మ తల్లి. బిడ్డ మంచం పక్కనే నిలబడి యిద్దర్నీ చూసుకుంటోంది.

"నువ్వేమన్నా అనుకో దుర్గయ్యా మీరు టీ.వీ. తెచ్చినప్పట్నుంచే మీ యింట్లో గోల మొదలైంది. అంతకుముందు ఎంత అన్యోన్యంగా ఉండే వాళ్ళు. మీకూ సుఖం లేదు. మీ పిల్లలకూ ఉపయోగం లేదు. మీ తగాదాకు కారణమైన టీ.వీ. ని తగలబెట్టాల్సింది. నువందుకమ్మా తగలబెట్టుకున్నావ్?" అంది కోపంగా మా ఆవిడ పున్నమ్మతో. పున్నమ్మ మాట్లాడకుండా తలపక్కకు తిప్పుకుంది. ఆమె కంటి చివరల నుండి ధారాపాతంగా కన్నీరు కారిపోతోంది.

"త్వరగానే కోలుకుంటావులే. ఏం దిగులుపడకు" అని ధైర్యం చెప్పి, వెనక్కు మళ్ళాం తెచ్చిన ఫ్రూట్స్ దుర్గయ్య చేతిలోపెట్టి దుర్గయ్య మెల్లగా లేచి గేటువరకూ మా వెనకాలే వచ్చాడు.

"ఎవరికన్నా చెప్పండి సారూ... టీ.వీ.ని అమ్మేస్తా. దాన్నమ్మినా అప్పులు తీరవు. మరో పదేళ్ళు పట్టుద్దనుకుంటా మేం బాకీల్లేకుండా నిలబడాలంటే" అన్నాడు దుర్గయ్య కన్నీళ్ళు తుడ్చుకుంటూ.

✤

ఢిల్లీలో పదిరోజులు

అంపశయ్య నవీన్

"ఈ మధ్య మీరు ఢిల్లీ వెళ్ళొచ్చార్టకదా?"

"అవును"

"ఢిల్లీలో ఎన్నిరోజులున్నారేమిటి?"

"పదిరోజులున్నాను"

"దేశ రాజధానిలో పదిరోజులుండటం అంటే చాలా గొప్పవిషయమే... ఢిల్లీ ఎలా ఉంది?"

"చాలా చల్లగా ఉంది"?

"అంటే"?

"మనకు డిసెంబర్‌లో ఎంత చలిగా ఉంటుందో ఇప్పుడక్కడ అంత చలిగా ఉంది"

"ఆశ్చర్యంగా ఉందే - మనకప్పుడే ఎండలు మండిపోతున్నాయి. ఫిబ్రవరిలోనే మే నెల వచ్చిందా అన్నట్టుగా ఉంది"

"ఢిల్లీలో వేసవి చాలా ఆలస్యంగా - అంటే ఏప్రిల్‌లో ప్రారంభమౌతుంది. మార్చిలో కూడా అక్కడ చల్లగానే ఉంటుంది"

"బావుందే... మనం ఢిల్లీలో ఉంటే ఎంత బావుండేదో"

"బావుండేదే కానీ ఒక్క విషయం ఢిల్లీలో ఎండలు కూడా దండిగానే ఉంటాయి. ఏప్రిల్‌లో ప్రారంభమయ్యే ఎండలు జూన్ చివరిదాకా మండిపోతుంటాయి. మే నెలలో అప్పుడప్పుడు డస్ట్‌స్టామ్స్ అంటే ఇసుక తుఫానులొస్తుంటాయి. ఢిల్లీ పక్కనే ఉన్న థార్ ఎడారిలోని ఇసుకంతా ఢిల్లీమీద పడ్తుంటుంది"

"అమ్మబాబోయ్... అయితే ఢిల్లీవాసులక్కూడా ఎండలబాధ తప్పదన్నమాట"

"ఢిల్లీవాసులకు చలీ ఎక్కువే- వేడీ ఎక్కువే. ఎండాకాలంలో థార్ ఎడారి ప్రభావం, చలికాలంలో హిమాలయాల్లో కురిసే మంచు ప్రభావం ఢిల్లీ మీద ఉంటాయి."

"ఢిల్లీలో పొల్యూషన్... అంటే వాతావరణ కాలుష్యం కూడా చాలా ఎక్కువే అంటారు"

"అవును... ఢిల్లీలో ఉన్నన్ని మోటారువాహనాలు భారతదేశంలోని మరే నగరంలోనూ లేవట. ఒకప్పుడు భారతదేశం మొత్తంమీద ఎన్ని కార్లున్నాయో ఒక్క ముంబై నగరంలోనే అంతకంటే ఎక్కువ కార్లుంటాయని చెప్పుకునేవాళ్ళు. కానీ ఇప్పుడు ఢిల్లీ ముంబైని మించిపోయింది. ఇప్పుడు ఢిల్లీలో ఉన్నన్ని వాహనాలు మరే నగరంలోనూ లేవట. అయితే ఇప్పుడు ఢిల్లీలో వాతావరణ కాలుష్యం చాలా తగ్గిపోయింది"

"అన్ని వాహనాలున్నప్పుడు వాతావరణ కాలుష్యాన్ని ఎలా తగ్గించగల్గారు"

"ఢిల్లీలో తిరిగే వాహనాలన్నిటికి సి.ఎన్.జీ ఇంజన్లు అమర్చుకోవాలని ప్రభుత్వం చట్టం చేసింది. సి.ఎన్.జీ అంటే క్రయోజెనిక్ గ్యాసుతో నడిచే ఇంజన్లు - వీటివల్ల మామూలుగా మనం చూసే పెట్రోల్ లేక డీజిల్ ఇంజన్ల నుండి వెలువడే కార్బన్ డయాక్సైడ్ పొగ వెలువడదు. ఢిల్లీ వీధుల్లో రోజూ లక్షల వాహనాలు తిరుగుతున్నా వాహనాల నుండి కార్బన్‌డయాక్సైడ్ వెలువడదు. సి.ఎన్.జి. ఇంజన్లలోనే గ్యాస్‌బర్న్ అయిపోతుంది తప్ప బయటకు వెలువడదు. ఈ కారణం వల్ల ఇప్పుడు ఢిల్లీలో వాతావరణ కాలుష్యమనేదే లేకుండాపోయింది"

"ఇది చాలా గొప్పవిషయమే..."

"ఢిల్లీలో వాతావరణ కాలుష్యం తగ్గిపోవడానికి మరో కారణం కూడా ఉంది. అదేమిటంటే ఢిల్లీలో చెట్లను బాగా పెంచారు. చాలా రోడ్లను చూశాను. రోడ్డకిరుపక్కలా పచ్చటి చెట్లను చూస్తుంటే ఎంత హాయిగా ఫీలయ్యానో... ఢిల్లీని సమీపిస్తున్నప్పుడు విమానం కిందకు దిగుతోంటే ఢిల్లీనగరం ఓ పచ్చటి అరణ్యంలా కనిపించింది. ఎక్కడచూసినా, ఎటువైపు చూసినా చెట్లేచెట్లు..."

"మొత్తంమీద ఢిల్లీ నగరం చాలా బావుంటుందన్నమాట"

"ఢిల్లీ నగరం కొన్నిచోట్ల ఎంత బావుంటుందో కొన్ని చోట్ల అంత చెత్తగా కూడా ఉంటుంది. ముఖ్యంగా పూర్వపు ఢిల్లీ అస్సలు బావుండదు. న్యూఢిల్లీలోని కొన్ని ప్రాంతాల్ని చూస్తోంటే మనం ఇండియాలోనే ఉన్నామా అన్న అనుమానం కల్గుతుంది. అంత శుభ్రంగా, అంత అందంగా ఉంటాయి. ముఖ్యంగా న్యూఢిల్లీలోని వి.ఐ.పి ఏరియాలు అలా ఉంటాయి.



కానీ చాలా ప్రాంతాల్లో శుభ్రత ఉండదు. డ్రైనేజీ సరిగా ఉండదు. మురికాల్వలోని నీరు రోడ్డుమీదే ప్రవహిస్తుంటుంది. చెత్తా చెదారమంతా రోడ్లమీదనే పారేస్తుంటారు. ఒక ప్రాంతానికి మరో ప్రాంతానికి మధ్య ఉండే ఈ వ్యత్యాసం మనల్ని చాలా ఆశ్చర్యపరుస్తుంది. నగరమంతా ఒకేలా ఉంటే ఎంత బావుండును అనిపిస్తుంది"

"ఢిల్లీ ఓ మినీ ఇండియా అంటార్ట. నిజమేనా అండీ"

"అవును. ఢిల్లీని ఒక మినీ ఇండియాగా చెప్పొచ్చు. భారతదేశంలోని వివిధ రాష్ట్రాల వాళ్ళందరూ మనకు ఢిల్లీలో కనిపిస్తారు. ఢిల్లీలో వినిపించని భారతీయ భాషంటూ ఉండదు. కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు, గుజరాత్ నుండి మేఘాలయ వరకు... భారతదేశంలో వేషభాషలన్నీ ఢిల్లీలో ఉండటాన్ని మనం చూస్తాం. బహుళ భాషలకూ, బహుళ మతాలకూ, బహుళ సంస్కృతులకూ నిలయమైన భారతదేశపు బహుళ సంస్కృతిని మనం ఒక్క ఢిల్లీలోనే చూడొచ్చు. ఇన్ని భాషలు మాట్లాడేవాళ్ళు. ఇన్ని ప్రాంతాల నుంచి వచ్చి స్థిరపడ్డవాళ్ళు. ఇన్ని మతాలవాళ్ళు ఇక్కడ శాంతియుత సహజీవనం చెయ్యడం భారతదేశపు బహుళ సంస్కృతి సాధించిన మహత్తర విజయమని చెప్పాలి. ఢిల్లీలో నివసించే ప్రజల్లో ఒక గొప్ప నగరంలో నివసించే ప్రజల్లో కనిపించే సంస్కారం కనిపించింది. చాలా మర్యాదగా మాట్లాడటం, ఒకొక్కరు "భయ్యా" అని సంబోధించుకోవడం, ఒకరికొకరు చాలా విషయాల్లో సహాయపడటం నన్ను ముగ్ధుణ్ణి చేసింది. నాకు తెలిసిన ఓ సీనియర్ ఆఫీసర్‌గార్ని కలుసుకోవడానికి నేను వాళ్ళింటికెళ్ళాను. అంత పెద్ద ఆఫీసర్ తన దగ్గర పనిచేసే అటెండర్లను "భయ్యా"! అని సంబోధించడం నన్ను ఆశ్చర్యపరిచింది."

"మీరు చెబుతుంటే చూసినంత ఇదిగా ఉంది. ఇంకా చెప్పండి"

"ఢిల్లీలోని పాఠశాలలన్నీ ఉదయం ఎనిమిదింటికే పనిచెయ్యడం ప్రారంభిస్తాయి. తెలతెలవారుతుండగా చీకట్లు పూర్తిగా విడిపోకముందే చిన్న పిల్లలు యూనిఫామ్‌లు స్వెట్టర్లు వేసుకొని బస్సుస్టాపుల దగ్గర బస్సుకోసం ఎదురుచూడటం నన్ను చాలా ఆశ్చర్యపరచింది. అంత చలిలో ఉదయం ఆరింటి నుంచే స్కూళ్ళకెళ్ళే పిల్లలు వేల సంఖ్యలో రోడ్లమీద కనిపిస్తుంటారు. పగలు రెండింటి వరకే స్కూళ్ళు పనిచేస్తాయి. రెండింటి తర్వాత పిల్లలంతా మళ్ళీ ఇళ్ళకు బయల్దేరుతారు. నవంబర్ నుండి మార్చి వరకు ఢిల్లీలోని చిన్నలూ, పెద్దలూ తప్పనిసరిగా స్వెట్టర్లు వేసుకుంటారు. ఎంత పేదవాడైనా తప్పనిసరిగా స్వెట్టరు వేసుకుంటాడు. మొత్తంమీద ఢిల్లీలో పదిరోజులుండటం ఒక గొప్ప అనుభవం" ✤

ఫలించని ఒప్పందం

రావూరి రమాదేవి



ఒక అడవిలో సింహం, పులి, తోడేలు, నక్క నివసిస్తుండేవి. అవి ప్రతిరోజూ సాయంత్రం మర్రిచెట్టు కింద చేరి, కబుర్లు చెప్పకునేవి. ఎదుటివారి ముందు గొప్ప కోసం అబద్ధాలు కూడా చెప్తుండేవి. ఆ రోజు కూడా అవన్నీ చెట్టు కింద చేరాయి. పులి కల్పించుకొని, "నక్కబావా! ఇవాళ ఏం వేటాడి తిన్నావు?" అని అడిగింది.

నక్కకు ఎండ్రకాయలు తప్ప ఏమీ దొరకలేదు. కానీ మిత్రుల ముందు గొప్ప కోసం, "ఇవాళ నా అదృష్టం బావుంది. పెద్ద నెమలి దొరికింది. అతికష్టంగా తిన్నాను దాన్ని. మరో రెండు రోజుల వరకు ఏం తినకున్నా ఫర్వాలేదు" అంది నేల మీద పొర్లాడుతూ.

"అబ్బ! ఎంత బాగుంటుందో నెమలి మాంసం. తినక కొన్నేళ్లయ్యింది" అనుకున్నాయి తోడేలు, సింహం, చిరుతపులి మనసులో.

తర్వాత తోడేలు పులిని, "నువ్వు వేటిని వేటాడావు?" అని అడిగింది. దానికి ఒక ఉడుత మాత్రమే దొరికింది. కానీ మిత్రుల ముందు పరువుపోతుందని, "నాకు ఇవాళ పెద్ద జింక దొరికింది. మధ్యాహ్నం నుండి సాయంత్రందాకా తిన్నా తరగలేదు. మిగిలిన సగం మాంసాన్ని రేపటి కోసం దాచేద్దామనుకున్నాను. ఇంతలో హైనాలు వచ్చి దీనంగా అడిగేసరికి వదిలేశాను. అవి రెండూ కడుపు నిండా తిని వెళ్లాయి" అంది బ్రేవ్‌మని త్రేన్చుతూ.

'ఆహా! జింక మాంసం ఎంత రుచిగా వుంటుందో...' అనుకున్న మిగతా మూడింటికి నోట్లో నీళ్లు ఊరాయి.

తర్వాత తోడేలు వంతు వచ్చింది. దానికి ఆ రోజు ఒక కుంటి కోడిపెట్ట మాత్రమే దొరికింది. ఆకలి కూడా తీరలేదు. కానీ బింకంగా, "నేను బయల్దేరిన వేళావిశేషం బావుంది. పొదలో చిక్కుకున్న అడవిగొర్రె దొరికింది. నాకంటే పెద్దగా, బలంగా వుంది. తీగల మధ్య చిక్కుకోవడం వల్ల చంపగలిగాను. లేకుంటే చాలా కష్టమయ్యేది. నేను తినగా మరో మూడు తోడేళ్లు వచ్చి చక్కగా తినేసి వెళ్లాయి" అంది ఆవలిస్తూ.

"తోడేలు అదృష్టం కూడా బావుంది. ఆ మాత్రం మాకు దొరికితే ఎంత బావుండు' అనుకున్నాయి మిగతా జంతువులు. ఆ తర్వాత వంతు సింహానిది. దానికి చేప తప్ప ఇంకేమీ దొరకలేదు. ఆకలితో వుంది. ఆ విషయం మిత్రులకు తెలియనీయకుండా, "ఆ... మీకు తెలియనిదేముంది? నాకు చిన్న, సన్న జంతువుల మాంసం రుచించదుగదా. ఓ ఏనుగును చంపి, దాని మెదడు తిని, మిగతాది వదిలేశాను. ఎన్నో నక్కలు, తోడేళ్లు ఎగబడి తిన్నాయి" అంది సింహం.

"బావుంది. అందరం రోజూ చక్కని ఆహారం తింటున్నాం కదా. మనం వేటాడిన మాంసాన్ని అందరం కలిసి పంచుకొని తింటే ఎలా వుంటుంది?" అంది తోడేలు.

"దివ్యమైన ఆలోచన. సమానత్వ భావం. మనం వేటాడిన మాంసాన్ని ఇదే చెట్టు కిందకు చేరుద్దాం. సమానంగా వాటాలు వేసుకొని తినేద్దాం" అంది సింహం. కష్టపడకుండా మంచి భోజనం తినొచ్చని దేనికదే మనసులో అనుకొని, అందుకు సంతోషంగా ఒప్పకున్నాయి. మర్నాటి సాయంత్రం అన్నీ చెట్టు కింద చేరాయి.

"నాకు ఈ రోజు ఒక కొంగ దొరికింది. ఇంద నా వాటా" అంది తోడేలు.

"అలాగా. నీకు గొర్రె పోతేలు దొరుకుతుందనుకున్నాం" అన్నాయి మిగిలినవన్నీ.

తర్వాత సింహం ఒక నీటి కోడిని ముందుపెట్టి, "ఇదే నేను ఇవాళ వేటాడిన ఆహారం" అంది.

"ఏనుగును వేటాడతావనుకున్నామే" అన్నాయి అన్నీ.

"నేనూ దాని కోసమే ప్రయత్నించాను. కానీ నిన్న ఏనుగును చంపినప్పట్నుండి అన్నీ కలిసికట్టుగా వుంటున్నాయి. దేని దగ్గరకు వెళ్లినా చంపేలా వున్నాయి" అని చెప్పింది సింహం.

"అలాగా... నాకూ పెద్ద జంతువులు దొరకలేదు. ఓ ఎలుక మాత్రం దొరికింది. ఇవాళ నా అదృష్టం బాగోలేదు" అంది పులి.

"ప్చ్. నీకు అడవిదున్నో, దుప్పో దొరుకుతుందని మేమెంతో ఆశపడ్డాం" అన్నాయి నీరసంగా మిగతా జంతువులు.

చివరిగా నక్క తన చేతిలోని రెండు పిట్ట గుడ్లను నేల మీద వుంచింది. "చక్కటి నెమలినో, బలిసిన కోడిపెట్టనో తిందామనుకున్నామే. గుడ్లు తెచ్చావా?" అన్నాయన్నీ నీరసంగా.

తెచ్చిన ఆహారాన్ని అవన్నీ నాలుగు సమాన భాగాలు చేసి తిన్నాయి. దేనికీ ఆకలి తీరలేదు. "ఎవరో ఒకరు కష్టపడి మరింత ఆహారం తెస్తే తినేద్దామనుకున్నాం. ఎవరికి వారే ఏ మాత్రం కష్టపడకుండా ఎదుటివారు తెచ్చి పెడితే సుఖపడదామనుకున్నాం. ఇలా అనుకోవడం వల్లే మన కడుపులు నిండలేదు. మనం నిర్మిద్దామనుకున్న సమానత్వ భావం కూడా ఫలవంతం కాలేదు. కాబట్టి రేపట్నుండి ఎవరికి వారమే ఆహారం సంపాదించుకొని తిందాం" అనుకున్నాయి అన్నీ. ✷





విచిత్రం



హేయ్! ఇవాళ్టి మన విచిత్రం చూస్తే మీకు ఏమనిపిస్తోంది? వేటగాడి బారినుంచో... క్రూరమృగం దాడి నుంచో తప్పించుకునేందుకు కుందేలు పరిగెడుతోందంటున్నారు కొందరు మిత్రులు. సరేగాని అంతకుమించి మీకు ఇంకేం కనిపించడంలేదా? మరి మాకు ఏదో ఒకటి కనిపిస్తోందే. కావాలంటే... పైన జవాబు చూడండి.

జవాబు:
పిల్లలూ... బొమ్మలో కుందేలు ఎవరిని చూసి భయపడి పరిగెడుతోందనుకున్నారు. గద్దను చూసే. అదిగో పైన ఆకాశంలో ఎగురుతున్న గద్ద నీడ... బొమ్మలో సరిగ్గా కుందేలుపైన వుంది కనపడిందా?!

కవల క్రీములేవి?



చిచ్చుబుడ్లూ...! వేసవి కాలం వచ్చేసినట్టుందికదా. ఇప్పుడు మీకు హిమక్రీములు తినాలనిపిస్తుందికదూ. అవేనర్రా! ఐస్క్రీములు. అందుకే ఆర్టిస్టు అంకుల్ ఇవాళ ఐస్క్రీముల బొమ్మ వేసి పంపారు. కాకపోతే ఇందులో రెండు కవల క్రీములు వున్నాయిట. అబ్బా... తెలియనట్టు అలా చూస్తారేంటి? ఒకేలా వుండే క్రీములు రెండు వున్నాయంట. వాటిని మీరు కనిపెట్టాలి. తెలీకపోతే పేజీ తిరగేసి చూడండి.

అమ్మో కప్ప

నేస్తాలూ... మీరు ఎప్పుడైనా కాగితంతో కప్ప బొమ్మ చేశారా? దాంతో మీ మిత్రులను భయపెట్టారా? లేదా! మరైతే ఇవాళ మీకు ఆ కాగితపు కప్పను చెయ్యడం ఎలాగో చెప్తామే. దాన్ని చేసి మీకంటే చిన్నవాళ్లని, బాగా పెద్దవాళ్లని దడిపించండి. ఓకేనా.



ఏమేం కావాలంటే... మందపాటి కాగితం, బంక, కత్తెర, పెన్సిల్, స్కెచ్‌పెన్నులు, క్రేయాన్లు, కదిలే కళ్లు (ఫ్యాన్సీ షాపుల్లో అమ్ముతారు).

ఎలా చెయ్యాలంటే... ముందు మందపాటి కాగితాన్ని తీసుకోండి. అందులోంచి దీర్ఘచతురస్రాకారపు కాగితాన్ని కత్తిరించండి. వెంటనే ఆకుపచ్చ రంగు వేయండి. దాని మీద రెండవ బొమ్మలోలాగా మూడు సమాన భాగాలుగా విభజిస్తూ పెన్సిల్‌తో గుర్తు పెట్టుకోండి. ఇప్పుడు ఈ కాగితాన్ని సరిగ్గా పెన్సిల్ గుర్తులు వున్న దగ్గర మడతపెట్టండి. అప్పుడు మీ చేతిలో డబ్ల్యు ఆకారంలో వున్న కాగితం వుంటుంది. ఇదే మనం చెయ్యబోయే కప్ప. ఇప్పుడు కాగితం పైభాగాన కళ్లు అతికించాలి. ఒకవేళ అవి దొరక్కపోతే స్కెచ్ పెన్నుతో వెయ్యొచ్చు.





ఇప్పుడు మందపాటి కాగితం నుంచి పొడవాటి నాలుక కత్తిరించండి. దీనికి ఎరుపు రంగు వేయండి. దాన్ని కప్ప నోటి కింద అతికించండి.





ఇప్పుడు మీ చేతివేళ్లను కప్ప కాగితాల కింద వుంచండి. అంతే. కాగితపు కప్ప పపెట్ రెడీ అయినట్టే.

తర్వాత మెల్లగా మీ వేళ్లను కదిలిస్తూ నోటితో 'బెక ...బెక...బెక...బె...' అంటూ మిత్రులను దడిపించొచ్చు. తమాషాగా వుంటుందిలే. ఇలా అన్నామని





మరీ ముసలివాళ్లను, బాగా చిన్న పిల్లలను దడిపించకూడదు. ఓకేనా. మరి ఆలస్యమెందుకు? చేసి చూడండి.

హాలో! ఈ వారం వీరి వీరి గుమ్మడి పండులో వచ్చినవారెవరో మీకు తెలుసా? అయినా ఈయన తెలియని వారు ఎవరుంటారులే. మరైతే వెంటనే ఆయన పేరేంటో కార్డు మీద రాసి పంపండి. సరైన సమాధానమైతే మీ పేరు, తరగతి, ఊరు ప్రచురిస్తాం. ఓకేనా. ఈ పని ఇవాళే ఇప్పుడే చెయ్యాలని తెలుసుకదా. మా చిరునామా:

వీరి వీరి గుమ్మడిపండు, బాలనేస్తాలు, ప్రజాశక్తి, స్ట్రీట్ నెం.1, అశోక్ నగర్, హైదరాబాదు.

వీరి వీరి గుమ్మడిపండు... వీరి పేరేమి?

సరైన సమాధానం రాసినవారు (బ్రాకెట్‌లోని అంకె వారు చదువుతున్న తరగతి)

సిహెచ్ చిత్రాంజని (5), సిహెచ్ గీతాకృష్ణ (7), కాకినాడ. పి.అనుదీప్ విలియం (8), పాడేరు. డి.కల్పలత (9), రంగపేట. ఎల్.లింగన్నబాబు, ఎల్.పూజ, ఎల్.కిరణ్‌కుమారి, పి.వెంకటరమణ, డి.సింహాచలం, బి.కళ్యాణరావు, జి.గంగ, డి.రమ్యశ్రీ, వి.శెట్టిబాబు, వి.మల్లమ్మ, ఎం.పద్మశ్రీ, కె.వెంకట్, కె.శైలు, కె.ఆంజనేయులు (10), లమ్మసింగి. ఎల్.సుబ్రమణ్యం, ఎం.చంద్రబాబు, ఎం.ధనకర్, (9), ఎస్.బాబ్జి (10), చిన్నగొట్టిగల్లు. కె.రాజుగౌడ్ (5), దౌల్తాబాద్. పి.రఘు (9), పొగళ్లపల్లి. జి.శ్యాంసుందర్ (5), మద్దూరు. ఎం.చంద్రశేఖర్, ఎం.తిరుపతయ్య, ఎం.చిట్టమ్మ, బక్కమ్మ, కె.భరత్‌కుమార్ (8), మామిళ్లపల్లి. డి.రాణాప్రతాప్ (7), వడ్లమూడి. ఎం.అవినాష్ (7), ఎం.అభిషేక్ (3), కంచరాం. ఎ.వంశీకృష్ణ (9), హన్మకొండ. కె.హరినాథ్ (10), తుంగతుర్తి. బి.విఘ్నేష్ (7), మాటూరు. ఇర్ఫాన్, చిత్తూరు. వి.బ్రహ్మం (7), బుద్ధారం. జి.తేజరెడ్డి (6), జి.కృష్ణయ్య, జె.వాణి, సి.గాల్‌రెడ్డి, జె.ఝాన్సీ, వనపర్తి. ఎస్.ఝాన్సీ (8), వడ్డిలంక వైర్. జి.మల్లేశ్వరి (9), కన్నెగండ్ల. జి.శివకుమార్ (7), మాటూరు, ఆలేరు. జి.సాయికిరణ్ (4), వంగపల్లి, యాదగిరిగుట్ట. బి.సృజన, (7), గీతాంజలి హైస్కూల్, కె.చరిత (5), సెయింట్ పాయిస్ గరల్స్ స్కూల్, హైదరాబాదు.

గత వారపు జవాబు
భగత్‌సింగ్

చిన్నారి చిత్రకారులు



జె.సి.మంజుల, 9వ తరగతి, గవర్నమెంట్ హైస్కూల్, ఎస్.ఎస్.గుట్ట, మహబూబ్‌నగర్.

ద్వితీయ బహుమతి గ్రహీత



ఆర్.నవీన్‌కుమార్, 6వ తరగతి, ఐ.డి.కాన్వెంట్, అచ్చంపేట.



కటారి తిరుపతి స్వామి,
8వ తరగతి,
బి.సి.హాస్టల్,
నాజర్‌పేట,
తెనాలి,
గుంటూరు.

పుట్టిన సంవత్సరం ఏది?

చిన్నారులూ... మీరు అప్పడప్పుడు మీ స్నేహితులను పుట్టిన సంవత్సరం చెప్పమని అడిగితే పెద్ద ఫోజు కొడతారు కదా. కానీ దాన్ని వాళ్లకు తెలియకుండా వాళ్లచేతనే చెప్పించొచ్చు. ఎలాగంటే....

ముందు వారు పుట్టిన సంవత్సరాన్ని ఒక కాగితంపై రాయమనండి. దానికి తరువాతి సంవత్సరమును కలపమనండి. వచ్చిన దానిని 5చే గుణించమనండి. అప్పడు ఆ నెంబరు ఎంతో మీకు చెప్పమనండి. అంతే మీకు వాళ్ల పుట్టిన సంవత్సరం ఎంతో తెలిసిపోయినట్టే. జబాబులోని ఒకట్ల స్థానమునకు ముందున్న సంఖ్య వాళ్లు జన్మించిన సంవత్సరం అవుతుంది. ఉదాహరణకు మీ స్నేహితుడు పుట్టిన సంవత్సరం 1996 అనుకోండి. 1996 + 1997= 3993 × 5 =19965 . జవాబులో ఒకట్ల స్థానం 5కు ముందున్నదే మీ నేస్తం పుట్టిన సంవత్సరం. మరి ఇలా చెప్పి మీ ఫ్రెండ్స్‌ను ఆశ్చర్యపరుస్తారుగా.

ఆ ఇద్దరు ఎవరంటే...



మన్ను, మిన్ను ఒకే తల్లి బిడ్డలు. పైగా వీరిద్దరూ ఒకే సంవత్సరంలో, ఒకే రోజు, ఓకేసారి పుట్టారు. కానీ ... కవలపిల్లలు కాదు. మరి వాళ్లెవరంటే... ట్రిపుల్స్‌లో ఇద్దరు. మూడో పిల్లవాడు ఎవరంటే... మున్ని. సరిపోయిందికదా.

ప్రత్యక్ష దైవాలు

పొత్తూరి రాజేంద్రప్రసాద్‌వర్మ

ఆకాశం మేఘాల దుప్పటి కప్పుకొంది. తూర్పు నుంచి వీస్తున్న చల్లటి గాలి శరీరాన్ని చుట్టుకుని ఒకలాంటి ఆనందాన్ని కలిగిస్తోంది. దూరంగా జాతీయ రహదారిపై వెళుతున్న లారీల రొద లయబద్ధంగా వినిపిస్తోంది. విశాఖజిల్లా పెందుర్తి మండలం రాంపురం పెందుర్తి నుంచి అనకాపల్లి వెళ్లే రహదారిలో ఉంది.

గ్రామ సరిహద్దులో చిన్న చెరువు... చెరువు పక్క నుంచి సన్నటి రహదారి. దానిని దాటిన తర్వాత పూరిళ్లు... పక్కా ఇళ్ళతో గ్రామం కనిపిస్తోంది. గ్రామానికి ఆనుకుని పచ్చటి పంట పొలాలు ఆకుపచ్చ చీరలు వరుసగా నేలపైన పరిచినట్లు కనిపిస్తున్నాయి.

పెందుర్తి రూటు నుంచి బయలుదేరిన పాత స్కూటర్ రాంపురం గ్రామ సరిహద్దులో ఆగింది. స్కూటర్‌పైన అరవయ్యేళ్ల వ్యక్తి ఉన్నాడు. ఊరి ముందు టీ కొట్టు వద్ద స్కూటర్‌ను స్టాండ్ వేశాడు.

పక్కనే ఉన్న కిళ్లీకొట్లోంచి సిగరెట్ కొనుక్కుని వచ్చి 'టీ' కావాలని ఆర్డరు చేశాడు.

టీ కొట్టు వ్యక్తి కిరోసిన్ స్టవ్‌తో కుస్తీలు పడుతున్నాడు.

"వెన్నెల బంగారయ్య ఇల్లు ఎక్కడ?" టీ కొట్టు వ్యక్తిని అడిగాడు.

ఇతని మాట వినగానే టీ కొట్టు వ్యక్తి ఎగాదిగా చూశాడు. తర్వాత గ్లాసు నిండా టీ నింపి దగ్గరికి వచ్చి పాత చెక్క టేబుల్‌పైన పెట్టాడు. తర్వాత "చెరువు పక్క నుంచి వెళితే వరస ఇళ్లుంటాయి. ఆ ఎనకే బంగారయ్య ఇల్లు!" అన్నాడు.

ఆ వృద్ధుడు ఆతృతగా వినడం చూసి "ఎవరుబాబూ తమరు? ఏడ నుంచి వస్తున్నారు?" ప్రశ్నించాడు.

రోడ్డుపైన వాహనాలు స్పీడుగా వెళిపోతున్నాయి.

టీ నీళ్లు గొంతులో దిగగానే వెచ్చగా ఉంది. చలి ఎగిరిపోయింది. "ఎక్కడనుంచొచ్చా నంటావా? విజయనగరంలో అనాథాశ్రయంలో పనిచేస్తున్నాను. బంగారయ్య కుటుంబీకులు ఇద్దరు పిల్లల్ని పెంచుతున్నారని పేపర్లో చదివాను. ఆ పిల్లల్ని మా ఆశ్రమంలో చేర్చుకోవాలని నిర్వాహక కమిటీ నిర్ణయించింది. ఆ విషయం చెప్పిపోదామని వచ్చాను. బంగారయ్య వద్ద ఉన్న ఇద్దరు పిల్లల్ని ఇస్తే తీసుకువెళదామని అనుకుంటున్నాను." ఏకధాటిగా చెప్పుకుపోయాడు.

అతని మాటలు వింటూ టీ కొట్టు వ్యక్తి ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశాడు. "ధర్మాత్ముల్లా ఉన్నారు బాబూ! బంగారయ్య, ఆ ఇంటి ఇల్లాలు పుణ్యాత్ములు. ఎంతో అభిమానంతో అనాథ పిల్లల్ని సాకుతున్నారు. మీలాంటోళ్లు ముందుకు వస్తే వాళ్లకి కొంత వెసులుబాటు కలుగుతుంది" నెమ్మదిగా అన్నాడు.

తర్వాత ఆ వ్యక్తి టీకి డబ్బులు ఇచ్చి కళ్లద్దాలను తీసి లాల్చీతో తుడుచుకుని మళ్లీ పెట్టుకున్నాడు.

"పేరుకు అనాథలేకాని అన్నీ తెలిసినవాళ్లు. ఒకప్పుడు బాగా బతికిన వాళ్లు. మీతో వస్తారో రారో తెలీదు".

"ప్రయత్నం చేస్తాను!" అంటూ స్కూటర్ స్టాండ్ తీసి కాస్త వంచి అప్పుడు కిక్ కొట్టి స్టార్ట్ చేశాడు. రాంపురం గ్రామంలోకి వెళ్లే రోడ్లోకి స్కూటర్‌ను పోనిచ్చాడు.

గత పదేళ్లుగా అనాథాశ్రమంలో పనిచేస్తున్న అతను అనాథల్ని గుర్తించడం, వారిని ఆశ్రమంలో చేర్చడం వంటి పనులు చేస్తుంటాడు. రాంపురంలో ఇద్దరు అనాథల సంగతి తెల్సిన వెంటనే నేరుగా బయలుదేరాడు. ఎలాగైన వారిని తమ ఆశ్రమంలోకి చేర్చాలని కృత నిశ్చయంతో బయలుదేరాడు.

* * *

రాంపురం గ్రామంలో అన్నంరెడ్డి అప్పారావు కుటుంబం కూలిపనితో జీవనాన్ని గడుపుతోంది. అప్పారావు సంపాదించిన దాంతో మొత్తం కుటుంబం అంతా బతుకుతోంది. గ్రామంలో చిన్న పూరింటిలో జీవిస్తున్నారు.

అప్పారావుకు భార్య, నాగరాజు, వెంకటలక్ష్మి అనే కొడుకు కూతురు ఉన్నారు. నలుగురు కుటుంబ సభ్యులు కలిగిన ఆ కుటుంబం గ్రామంలో పేదరికానికి ప్రతీకగా ఉండేది. కేవలం పూరి గుడిసె తప్ప మరేమీ లేదు. భార్యాభర్తలిద్దరూ ప్రతిరోజూ కూలి పనికి వెళ్లి కుటుంబాన్ని పోషించేవారు.

పెద్దకొడుకు అన్నంరెడ్డి నాగరాజు పుట్టుకతోనే పోలియో బారినపడ్డాడు. బుద్ధి మందగించిపోయింది. నోరు మూగబోయింది. రెండు కాళ్లూ నడవడానికి వీలులేకుండా చచ్చుబడిపోయాయి. అతనికి బైట ప్రపంచం ఏమిటో తెలియదు. ఆకలి వేస్తే కేకలు వేయడం తప్ప మరొకటి తెలియదు. నిత్యం మంచంపైనే యాతన పడుతుంటాడు.

ఇంటి పేరు నిలబెడతాడనుకున్న కొడుక్కి నిలబడటానికే ఊత లేనందువల్ల తల్లిదండ్రులు ఇద్దరూ తల్లడిల్లిపోయారు. అయినప్పటికీ అతడి పట్లే ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పోషించారు.

సంపాదించిన సొమ్ముతో కలో గంజో తాగుతూ జీవితాన్ని నెట్టుకువస్తున్న సమయంలో దురదృష్టం ఆ కుటుంబాన్ని వెంటాడింది. కూలి పనికి వెళ్లిన అప్పారావు గుండెపోటుతో మృతి చెందాడు.

కుటుంబానికి ఏకైక ఆధారమైన కుటుంబపెద్ద మృతి చెందడంతో మొత్తం అందరూ తల్లడిల్లిపోయారు. తమ కుటుంబనావను ఎవరు నడిపిస్తారని అయోమయంలో పడిపోయారు. ఆ సమయంలో అప్పారావు భార్య లక్ష్మి కుటుంబభారాన్ని నెత్తికెత్తుకుంది. అవిటివాడైన కొడుకు, ప్రపంచజ్ఞానం తెలియని కూతురుతో సంసారాన్ని ఈదడానికి నిర్ణయించుకుంది. భర్త చేసే కూలి పనికి తనూ బయలుదేరింది. మగవాళ్లతో సమానంగా కూలి లభించకపోయినప్పటికీ వచ్చిన దాంతో సరిపెట్టుకునేది. భర్తలేని లోటు స్పష్టంగా కనిపిస్తున్నా పిల్లలకు ఎటువంటి అన్యాయం జరగకుండా కాపాడుకుంది.

ఆ సమయంలోనే ఆ పిల్లల్ని మరో దురదృష్టం వెన్నాడింది.

కుటుంబ భారాన్ని నెత్తిన పెట్టుకున్న తల్లి లక్ష్మి కూడా అకస్మాత్తుగా మృతి చెందడంతో ఇద్దరు పిల్లలు అనాథలు అయిపోయారు. ముందూ వెనకా ఎవరూ లేరు. బంధువర్గం కూడా లేరు. దీంతో నా అనేవారు లేనివిధంగా తయారయ్యారు.

రాంపురం గ్రామంలో అనాథలైన పిల్లల్ని

ఆదుకోవడానికి ఆదరించడానికి ఎవరూ కనిపించలేదు.

అంత్యక్రియలు పూర్తయ్యాయి.

ఆకలి అని చెప్పలేని అవిటి నాగరాజు. అన్నయ్య దుస్థితికి ఏమీ చేయలేని అసక్తురాలిగా ఉన్న చెల్లి వెంకటలక్ష్మి ఒంటరిగా మిగిలిపోయారు.

వారిని ఏ వసతిగృహంలో అయినా చేర్పించాలని కొంతమంది గ్రామస్తులు సలహా ఇచ్చారు. నాగరాజును మానసిక వికలాంగుల పాఠశాలలోనూ, వెంకటలక్ష్మిని బాలికల హాస్టల్‌లోనూ చేర్పించడానికి ప్రయత్నాలు చేశారు.

వారిద్దరిని విడగొట్టవద్దని మరికొంతమంది చెప్పారు.

అసలే తల్లీదండ్రీ లేని ఇద్దరు పిల్లల్ని చెరోచోట ఉంచడంవల్ల మరింత మానసిక ఒంటరితనానికి గురవుతారని గ్రామపెద్దలు చెప్పారు.

ఆ సమయంలో ఆపదబంధువులా వెన్నెల బంగారయ్య కుటుంబం ముందుకు వచ్చింది. నా అనేవారు లేని అన్నా చెల్లెళ్ల పోషణభారం తీసుకుంటానని గ్రామస్తుల అందరిముందూ ప్రకటించాడు.

బంగారయ్య ప్రకటన ఆశ్చర్యాన్ని కలిగించింది.

ఇద్దరు పిల్లలు కలిగిన బంగారయ్య దంపతులు మరో ఇద్దరు పిల్లల్ని పోషించడానికి ముందుకు రావడాన్ని గ్రామస్తులు హర్షించారు. ఆస్తి కోసమో, పిల్లలులేని లోటు తీర్చుకోవడానికో ఎవరైనా ఇటువంటి దత్తత తీసుకుంటారు. కాని అందుకు విరుద్ధంగా ఎటువంటి ప్రతిఫలాన్ని ఆశించకుండా పిల్లల భారాన్ని తీసుకోవడం ఎంతో గొప్ప విషయమని గ్రామస్తులు బంగారయ్య దంపతుల్ని ప్రశంసించారు.

ఆరోజు నుంచి నాగరాజు, వెంకటలక్ష్మి మకాం గుడిసెలోంచి బంగారయ్య ఇంటిలోకి మారిపోయింది.

తమ ఇద్దరు పిల్లలతో వీరిని కూడా స్వంత పిల్లలమాదిరిగా చూసుకోవడంతో తల్లిదండ్రులు లేని లోటువారికి తెలియలేదు. ఒకే సంతానం మాదిరిగా వారికి అన్నీ అమర్చేవారు.

వెంకటలక్ష్మిని స్థానికంగా ఉన్న కాన్వెంటులో తమ పిల్లలతో పాటు చేర్పించారు. స్వతహాగా చురుకైనది, తెలివైనదీ కావడంతో అన్ని విషయాలు తెలుసుకుంటూ చదువులో ముందుండేది. పదేళ్ల వయస్సు పిల్ల అయినప్పటికీ అంతకన్నా ఎక్కువ వయసు పిల్లల మాదిరిగా ఎంతో అవగాహన కలిగి ఉండేది.

ఆమెకన్నా ఎనిమిదేళ్ల పెద్దవాడైన అన్నంరెడ్డి నాగరాజు మనసూ ఎదగలేదు. మానసిక, శారీరక అంగవైకల్యాలు రెండూ అతనికి శాపంగా తయారయ్యాయి. నిత్యం మంచంపైనే యాతన పడే నాగరాజుకు అన్ని సపర్యలూ బంగారయ్య కుటుంబీకులే చేసేవారు. నాగరాజు ఆకలిని గమనించి వేళకు అన్నం తినిపిస్తున్నారు. ప్రతీవారం వైద్యుల వద్దకు తీసుకువెళ్లి వైద్యం చేయిస్తున్నారు. వెర్రిగా కేకలు వేసిన సమయంలో అతనికి ఆకలి వేస్తుందని గమనించి అన్నం తీసుకునిపోతే తింటుంటాడు.

స్వంతపిల్లలు కాకపోయినా కన్నపిల్లల మాదిరిగా బంగారయ్య కుటుంబీకులు చూసేవారు. అనాథలైన ఆ ఇద్దరు పిల్లల్ని పెంచడంలో ఎంతో మానవత్వాన్ని చూపించేవారు. ముఖ్యంగా కాళ్లు చచ్చుపడిపోయిన నాగరాజును ఆదుకోవడాన్ని ఎంతోమంది మెచ్చుకునేవారు.

ఇంట్లో పిల్లలు మాదిరిగా బంగారయ్య వారిద్దరినీ చూసేవారు. ఎవరడిగినా తమకు నలుగురు పిల్లలని వారు చెప్పుకునేవారు. నా అనేవారు లేని ఆ ఇద్దరు పిల్లలకు అన్నీ తానేఅయి పెంచడం వల్ల వారు కూడా ఇంటిలో మనుషులు మాదిరిగా కలిసిపోయారు.

* * *

రాంపురంలో వెన్నెల బంగారయ్య ఇంటి గేటు తీసుకుని ఆ వ్యక్తి లోపలికి అడుగుపెట్టాడు.

"ఎవరు బాబూ?" లోపల్నుంచి వినబడింది ఆ వెంటనే ఒకామె లోపలినుంచి వెలుపలికి వచ్చింది. సన్నగా ఎర్రగా ఎత్తుగా ఉన్న ఆమె, బైట షరాయి లాల్చీతో నిల్చున్న వ్యక్తిని చూసి "ఎవరు కావాలి?" అని అడిగింది.

ఆ వ్యక్తి తటపటాయించాడు. తర్వాత నెమ్మదిగా చెప్పాడు.

''నాపేరు రంగధామారావు.. విజయనగరంలో అనాథశరణాలయం నుంచి వస్తున్నాను." అన్నాడు.

ఆమె విస్మయంగా చూస్తోంది.

"మీ గురించి పేపర్లో చదివాను. అందుకే వచ్చాను. ఇక్కడ కూర్చోవచ్చా?" అంటూ ఆమె జవాబు కోసం ఎదురుచూడకుండా కుర్చీ లాక్కుని కూర్చున్నాడు.

"బంగారయ్యగారు లేరు. విశాఖపట్నం వెళ్లారు. ఏం పనిమీద వచ్చారు?" అంది.

"మీ ఇంటిలో ఇద్దరు అనాథ పిల్లలున్నారని తెలుసుకుని వచ్చాను. వారిని పంపిస్తే నాతో శరణాలయానికి తీసుకువెళ్లి చేర్పిస్తాను. అన్ని సదుపాయాలు సమకూరుస్తాను. మీకు ఎటువంటి భారం కూడా ఉండదు.'' రంగధామారావు చెప్పుకుపోతున్నాడు.

ఇంతలో అన్నంరెడ్డి నాగరాజు అరుపులు లోపలి నుంచి వినిపించాయి. అవి ఆకలికోసం అరుస్తున్న అరుపులని బంగారయ్య భార్య రామయ్యమ్మకు తెలుసు. అందుకే గబగబా లోపలికి వెళ్లింది.

ఆమె వెళ్లడాన్ని చూస్తుండిపోయాడు రంగధామారావు.

అయిదు నిమిషాల తర్వాత లోపలి నుంచి రామయ్యమ్మ వచ్చింది.

"నాగరాజుకు ఆకలి వేస్తోంది. పాపం నోరు విడిచి ఏమీ అడగలేదు. ఆ అరుపులను అర్థం చేసుకోవలసిందే. అందుకే లోపలికి వెళ్లి గ్లాసుతో పాలు తాగించి వచ్చాను. తల్లీదండ్రీలేని అనాథ కదా?" ఆమె అంది.

"అంటే?"

"అవును. మీరు అనాథ శరణాలయంలో చేర్చాలనుకుంటున్న పిల్లల్లో పెద్దవాడు. వయసు పెరిగినా మనసు శరీరం ఎదగని వ్యక్తి." అంటూ పక్క గదిలో మంచంపై పడుకున్న నాగరాజును చూపించింది.

ఇంతలో స్కూలు డ్రెస్ వేసుకుని అన్నంరెడ్డి వెంకటలక్ష్మి గేటు తీసుకుని లోపలికి వచ్చి కొత్తగా వచ్చిన రంగధామారావును చూసి తటపటాయిస్తూ ఉండిపోయింది. "రామ్మా లక్ష్మీ! లోపలికి వెళ్లు!" అంది రామయ్యమ్మ. వెంకటలక్ష్మి వెళ్లిన తర్వాత "ఆ అబ్బాయి తర్వాత పిల్ల. ఈమె కూడా అనాథే" అంది.

రంగధామారావుకు నోట మాట రాలేదు.

వారిద్దరూ అనాథలని కానీ, ఆ ఇంటితో సంబంధంలేనివారు అని కాని ఎవరైనా చెబితే తప్ప నమ్మబుద్ధి కావడంలేదు.

"మీకు ఈ పిల్లలంటే ఇష్టం ఎక్కువగా ఉన్నట్లుంది" అన్నాడు.

"ఇష్టం అంటారో ప్రేమంటారో తెలీదు. వీరు మాకు పుట్టకపోయినా మా పిల్లలే. మా స్వంతపిల్లలను వీళ్ళతో వేరుచేసి మాత్రం చూడలేకపోతున్నాం. మా ఆయన బంగారయ్య గారికైతే వీరిద్దరూ అంటే ఎంతో ప్రేమ. ఎక్కడికి వెళ్లి ఇంటికి వచ్చినా భోజనం చేశారా అని అడుగుతారు. మా పిల్లలకు ఏం తెస్తారో వీరిక్కూడా అదే తెస్తారు. ఇప్పుడు చూశారు కదా ఈ పాపను నెలకు వందరూపాయలు ఫీజు కట్టి మరీ పక్కనున్న కాన్వెంటులో చదివిస్తున్నారు".

రామయ్యమ్మ మాటలు విని రంగధామారావు ఏమీ జవాబు చెప్పలేకపోయాడు. వీరి మాటలు విని ఇంటిలోపల నుంచి రామయ్యమ్మ తల్లి పెద్ద గ్లాసుతో మజ్జిగ కలిపి తీసుకువచ్చి అందించింది.

రంగధామారావు అందుకుని గటగట తాగివేశాడు.

"వీరిని నాతో పంపిస్తే మా అనాథ శరణాలయంలో మరింత మంచి బతుకును ఇస్తాం. బంగారయ్యగారు వచ్చేంతవరకూ కూర్చుంటాను" స్వాంతనగా అన్నాడు.

రామాయ్యమ్మ కళ్లల్లో ఎరుపుజీరలు కన్పించాయి.

''అందుకోసం అయితే మీరు ఉండనవసరం లేదు" ఆమె మాటల్లో అనుకోకుండానే కాఠిన్యం తొంగిచూసింది.

రంగధామారావు బిత్తరపోయాడు.

"ఈ పిల్లలిద్దరూ అనాథలు కాదు. మా ఇంటి దీపాలు మా కంటి వెలుగులు. వారికి ఎవరూ లేరని అనుకోవద్దు. కంటికి రెప్పలా కాపాడుకునే మేమున్నాము. మా ఆనందంలో వారికి భాగముంది. మా సంతోషంలో వారికి వాటా ఉంది. అనాథలని అవిటివాడని వీరి మీద అందరికీ ఎంత ఏహ్యత ఉన్నా మాకు మాత్రంలేదు. వీరిద్దరూ మా ఇద్దరు పిల్లలతో సమానం. వీరిని మా నుంచి ఎవరూ వేరుచేయలేరు. మేం ధనవంతులం కాకపోవచ్చు. అయినా మాకు కలిగినదాంతో పోషిస్తాం. పెద్దవాళ్లని చేస్తాం. ప్రయోజకుల్ని చేస్తాం." అని ఆమె ఏకధాటిగా చెప్పుకుపోతోంది. నోట్లోంచి మాటలతూటాలు వస్తుంటే కంటిలో నుంచి జలపాతాలు ఉబుకుతున్నాయి. చీర చెంగుతో కళ్లు వత్తుకుంది.

రంగధామారావుకు నోటమాట రాలేదు.

లేచి నిల్చున్నాడు.

మాటా పలుకూ లేకుండా వెనుదిరిగి తన పాత స్కూటర్‌వైపు భారంగా అడుగులు వేశాడు. వెనుదిరిగి ఒక్కసారి వెన్నెల బంగారయ్య రామయ్యమ్మల ఇంటివైపు ఆరాధనగా చూశాడు. ప్రత్యక్షదైవాలున్న కోవెల ఆ ఇల్లు అనుకున్నాడు.

డూప్లికేట్‌కి డూప్లికేటు ఉచితం

పి. జ్యోతి

ట్రింగ్, ట్రింగ్‌మని కాలింగ్ బెల్ మోగింది.

ఎవరై ఉంటారబ్బా, అనుకుంటూ వెళ్ళి డోర్ తీశాను.

ఎదురుగా ఓ అబ్బాయి. ఆ అబ్బాయికి దాదాపు ఇరవై ఏళ్లుండవచ్చు. నీట్‌గా టక్ చేసుకుని ఉన్నాడు. నన్ను చూడగానే "నమస్తే మేడమ్" అన్నాడు మర్యాదగా. ఆ తరువాత తను అమ్మకానికి తెచ్చిన వస్తువుల గురించి ఏదో చెప్పబోతూంటే, నేను ముఖ్యమైన పనిలో ఉన్నందున "బాబూ నాకేం వద్దు వెళ్ళవయ్యా", అన్నాను కాస్త చిరాకుగా.

అందునా ఈ మధ్య ఇలా రోజుకొకళ్ళు ఇంటికి వచ్చి జొరబడి, వద్దంటే జిడ్డుల్లా గుమ్మం పట్టుకు నిలబడే వారెక్కువయ్యారు. పాపం వాళ్ళ డ్యూటీ వాళ్ళది అని వారిపై జాలిపడి అప్పుడప్పుడూ కొంటుంటాను కూడా.

ఇలా నేను అనుకుంటూ ఉండగానే ఆ అబ్బాయి తను మోసుకొచ్చిన పెద్దబ్యాగ్‌లోనుండి రెండు లోషన్ బాటిల్స్ పైకితీసి చూపిస్తూ...

"మేడమ్ రెండు బాటిల్స్ కొంటే మరొక రెండు ఫ్రీ. మీకు తక్కువ రేటులో ఎక్కువలాభం. తీసుకుని చూడండి వీటి గొప్పదనం మీకే తెలుస్తుంది కావాలంటే నేనే చూపిస్తానుండండి..."

అంటూ తన బ్యాగ్‌లోనుండి ఒక బాటిల్ ఓపెన్‌చేసి ఒక కాటన్‌పీస్ తీసుకుని, నా అనుమతి లేకుండానే, బూట్లు టక టక లాడించుకుంటూ మా ముందుగదిలోని కంప్యూటర్ వద్దకు వచ్చి మానిటర్ స్క్రీన్‌ను కాటన్‌మీద బాటిల్‌లోని లోషన్‌వేసి తుడిచాడు. అబ్బో మానిటర్ స్క్రీన్ ఎంతమెరుపో! కొత్తలో కూడా అలా మెరవలేదు నాకు వెంటనే స్క్రీన్ ముద్దెట్టుకోవాలనిపించింది. మరీ అతని ముందే బాగోదు కదా అందుకే నా ఎక్స్‌ప్రెషన్స్ బయటకు కనబడనీకుండా అతనితో, మరి కంప్యూటర్, టీ.వీ వంటివే క్లీన్ చేసుకోవచ్చా ఇంకా దేనికైనా పనిచేస్తుందా ఈ లోషన్ అన్నాను సందేహంగా.

నా మాటలు వింటూనే నేను కొన్నంత ఆనందపడిపోయి అతను..

"లేదు మేడమ్, ఫ్రిజ్, వాషింగ్‌మెషీన్, డైనింగ్‌టేబుల్, డ్రెస్సింగ్ టేబుల్, అల్మారాలు, బాత్రూమ్స్, సింక్, వాష్‌బేసిన్స్, టైల్స్ వగైరా వగైరా.." చాలా పెద్ద లిస్టు చదివేశాడు.

చాంతాడంత ఆ లిస్టు అంతా విన్న తరువాత నేను అతనికేదో పరీక్ష పెట్టే దానిలా మా ఫ్లోరింగ్ చూపిస్తూ రెండుటైల్స్ పై ఎప్పుడో పడిన మొండిమరక, అది నేనెన్నిసార్లు తుడిచినా వదల్లేదు. దాన్ని చూపిస్తూ "బాబూ ఇదిగో ఈ మరకలు వదుల్తాయా" అన్నాను.

అంతే వెంటనే అతను మోకాళ్ళపై క్రింద కూర్చుని కాస్త లోషన్‌ను నేరుగా క్రింద మరకలపై వేసి కాటన్‌తో తుడిచాడు. అంతే టీ.వీలో తలనొప్పి అడ్వర్టయిజ్‌మెంట్‌లో అంటారే అలా వెంటనే నావంక తిరిగి "ఇట్స్‌గాన్" అన్నాడు.

నేను కూడా అది చూసి "పోయిందే" అన్నాను. ఇహ నాకు ఆ లోషన్ బాటిల్స్‌పై గొప్పనమ్మకం కలిగింది. తీసుకోవాలనిపించింది. పాపం ఆ అబ్బాయిచేత ఇంకా ఎన్నని తుడిపిస్తాం అని అనుకుని అయితే రెండు బాటిల్స్‌కు రెండు ఫ్రీ నాలుగుకొంటే నాలుగుఫ్రీ కదా మొత్తం ఎనిమిది బాటిల్స్ వస్తాయని అనుకుని, "రెండు బాటిల్స్ రేటెంత" అన్నాను.

"అతను "ఫిఫ్టీరూపీస్" అన్నాడు.

నేను "ఫోర్ బాటిల్స్ ఇవ్వండి" అని చెప్పి లోనికి వెళ్ళి వందరూపాయలు తెచ్చి అతనికి ఇచ్చాను. అతను ఎనిమిది బాటిల్స్ ఇచ్చి వెళ్ళిపోయాడు.

అతనలా వెళ్ళగానే డోర్‌వేసేసి, మావారు ఆఫీసునుండి వచ్చేటప్పటికి ఇల్లంతా మెరుపులమయం చేయాలన్న తలంపుతో ఒక బాటిల్ ఓపెన్‌చేసి కొంచెం కాటన్ తీసుకుని, టీపాయ్‌తో మొదలెడదాం అనుకుని కాస్త టీపాయ్‌మీద లోషన్‌వేసి తుడిచా...

ఇందాక ఆ అబ్బాయి బాటిల్ మూతతీయగానే మంచి సువాసనతో నా ముక్కుపుటాలనదరగొట్టేసింది. ఇప్పుడే వాసనాలేదు. వాసన లేకపోతే పోయింది. పవరు ఉంటే చాలనుకున్నా కానీ టీపాయ్‌మీద దుమ్ము కూడా వదల్లేదు. మరకల సంగతి దేవుడెరుగు కనీసం పైపై దుమ్ముకూడా వదల్లేదు.

పోనీ ఇదొక్క బాటిల్ ఇలా ఉందేమోనన్న అనుమానంతో అన్ని బాటిల్సూ ఒక్కొక్కటీ పరీక్షించి చూశా అన్నీ ఇలానే వున్నాయి.

ఇంతలో మావారు ఆఫీసునుండి వచ్చారు. నన్నూ నా ముందున్న బాటిల్స్‌ను, నా ప్రయోగాన్నిచూసి నాతో "రాణీ! ఏంటివన్నీ" అంటూ ఆశ్చర్యంగా ప్రశ్నించాడు. జరిగినదంతా పూసగుచ్చినట్టు వివరించి చెప్పా.

"రాణీగారిని ఆ అబ్బాయి బోల్తా కొట్టించాడు" అన్నారు నావంక చూస్తూ.

"లేదండీ నాకళ్ళముందే, ఇదిగో శుభ్రంచేసి చూపించాడు కావాలంటే ఇదిగో చూడండి" అంటూ మానిటర్‌స్క్రీన్ చూపించా.

"ఆ ఒక్క బాటిల్ మాత్రమే కావాలని అడగాల్సింది. ఒక్క క్వాలిటీ బాటిల్ మాత్రమే చూపించి, ప్రయోగించి మిగతావి డూప్లికేట్లమ్మి మోసం చేశాడన్నమాట."

ఒక్క డూప్లికేటుకి మరో డూప్లికేటు ఉచితం నాలుగు డూప్లికేట్లకి మరో నాలుగు... మొత్తం ఎనిమిది డూప్లికేట్లు.

✤

మందుల పంటలద్దు

డా॥ కాలువ మల్లయ్య

“ఇన్నొద్దులు భూకంపాల గురించి విన్నం... తుపాన్ల గురించి విన్నం... అతివృష్టి చూసినం... అనావృష్టి చూసినం... కరువు కాటకాలు అనుభవించినం... ఇంకా చాలా సంగతులే విన్నం... చూసినం... కని గీ సునామీ గురించి వినుడు, చూసుడు గిదే కొత్త... ఎయిడ్సోలె గిదేంది...? సముద్రముప్పొంగుడేంది...? అండ్ల మనుషులు కొట్టుకుపోయి సచ్చుడేంది...? గింత పాపముంటాదా...? పాపం పెరుగుతుంది. అందుకే గిట్లయితంది. పాపం పెరుగకుంటేమయితది...? విషపాతుకాలు పెరుగవట్టె... ఒగలనొగలు పట్టించుకుంటలేకపెయిరి. గివ్వన్ని వట్టిగనే పోతయా... తిలా పాపం తలా పిడికెడు తిన్నట్టు గావట్టె... మనిషి చేసిన పాపాలు ఫలితాలను మనిషే అనుభవించవలసి రావట్టె... ఏంది గిది...? సునామంటె ఎంత ఘోరం...?”

బాధపడుకుంటన్నడు రవీందర్...

“అవును మరి...! ఎవరు చేసిన కర్మకు వాళ్ళే బాధ్యులుగద...! మనిషి చేసిన పనులకు మనిషే బాధ్యుడైతడు...” అన్నడు కమలాకర్.

“మీ మాటలెట్లున్నయంటె ఏదో సామెత చెప్పినట్టున్నయ్‌... మనిషి మనిషని మొత్తుకుంటున్నరు... మనిషేం జేసిండు...? అరే... ప్రకృతి విలయాన్నెవ్వరాపుతరు...? ఇల్లుగాలి ఒకదేడున్నుంటె మనిషి మనిషని ఆడిపోసుకునుడెందుకు...?”

“ఆ మాట నిజమేనోయ్‌ తిరుపతయ్య...! ప్రకృతి సహజంగ వచ్చేవాటిని ఆపుడు ఎవరి నుంచి గాదు. కాని వాట్లో కొన్నిటికి మనిషే కారణమవుతున్నడు. వచ్చే ఆపదలు వస్తనే ఉంటయ్‌... కాని మనిషి కొన్నిట్ని కొనితెచ్చుకొనుడెందుకు...? సునామీ అంటే సముద్ర భూకంపమనోంటింది... సముద్రంల భూకంప మస్తె ఉప్పొంగుతుందిగద...! మరి గా ఉప్పొంగిన నీళ్ళెక్కడికి పోతయ...? భూమ్మిదికే కద...! మనిషి, జీవరాశులు ఉండటానికి అనుకూలమైనది భూమొక్కటే... సముద్రం నీళ్ళు మూడు పాళ్ళాక్రమించుకొనుంటె భూమున్నది పావుల మందమే... ఆయింత భూమి నీళ్ల పాలయితె మనిషి బతికేదెక్కడ...! జీవరాశులుండేదెక్కడ...? సముద్రాంలో ఉప్పొంగుతె, భూమ్మిద వేడి పెరిగి మంచు కరుగుతె ఉన్నదే కొంచెమంత భూమి, అండ్ల కొంత నీళ్లపాలు గాదా... మరిగ మనుషులెక్కడుండాలె...?”

“మరి గివ్వన్ని పాపం పెరిగె పటికెనే పోతున్నయి గద...”

“పాపం పెరుగుడంటేంది...? మనిషికి విపరీతమైన సుఖవాంఛ పెరుగుడే... ఆపేక్ష పెరుగుడే... చెట్లు నరికిరి... అడవులు నాశనం జేసిరి. చెర్లు కుంటలు ఆక్రమించుకున్రి... నీళ్లెక్కడ నిలువ కుండ జేసిరి. వానకాలంలోనే ఎక్కడొక్క బొట్టు నీళ్ళు కూడా కనవడకపోవుడెప్పుడన్నునదా...? గిదంత సుఖవాంఛ ఫలితమే కద...

వానాకాలంల వర్షాల కొరకెదిరిచూసుడు... భూగర్భజలాలు పాతాళలోకంలకు పాయె. ఇవన్నెందుకయితున్నయ్‌...? మనిషి చేసిన పనులతోనే కద...? భూమే గిట్లయితె సముద్రం పొంగి ఉన్నభూమిని ఆక్రమించుకుంటుంటె ఇక మనిషి మనుగడెట్లు...? ఇవన్నెందుకైతున్నయి...? సముద్రంలనే అణుపరీక్షలు, ఫ్యాక్టరీల నుంచొచ్చు విషపదార్థాలను విడిసి పెట్టుడు, ఇంకెన్ని జేత్తుండ్రని... గివన్ని జేత్తె సముద్రానికి కోపం రాదా...?

ఫ్యాక్టరీల పొగ, దుమ్మూ, ధూళీతోని గాలికాలుష్యం గావట్టె. ధ్వని కాలుష్యం, నీటి కాలుష్యం ఇవ్వన్నీటితోని మనిషి బతుకు ప్రశ్నార్థకం కావట్టె... పాపమంటేంది... మరి గిదే...” అన్నడు రాజమల్లు...

“బాగ జెప్పినవే రాజమల్లన్న...! మనిషెందుకాలోచించడు...? మనిషి ముందుకు పోతున్నడా వెనుకకు పోతున్నడా అనిపిస్తంది”

మనిషేం తిని బతుకుతాడు చెప్పు... బంగారం తింటాడా...? కంప్యూటర్లు తింటాడా...? అధికారం తింటాడా...?

ఓ దిక్కు నాలెబొయ్యారల లెక్క తవ్వుకుంది తవ్వుకుంట పోవట్రి... అడుగున బోలె ఏర్పడుతది గద...? గా భూమంత పాడయినట్టే కద... మనిషికి ఏది చాలలేకపాయె. ఉన్న భూమిని, ప్రకృతిని ఉన్నట్టు ఉండనీయక నాశనం జేత్తెట్లు...? ప్రకృతిని కాపాడుకోకుంటె మనం బతుకుతమా చెప్పు... భూములల్ల విపరీతంగ మందులేసి పంటలు పండించవట్టిరి... మరిగ భూమి పాడుగాదా...” అన్నడు కమలాకర్...

“మందులెయ్యకుంటె వంటలెట్ల పండుతయ్‌...? గింత జనాభాకు సరిపోవన్నంటె మందులెయ్యకుండ పండే పంటలు సరిపోతయా...!”

“రసాయనిక ఎరువులు విపరీతంగా వాడితెనే బాగ పంటలు పండుతయనుకునుడు తప్పు... స్వాభావిక ఎరువులు, పశువులపేడ, గొర్రెరువు, పందెరువు వాడి వేల సంవత్సరాలుగా మన వాళ్ళు పంటలు పండించిండ్రు... భూసారం అట్లనే కాపాడబడింది. మోతాదును మించి రసాయనిక ఎరువుల వాడకంతోని భూసారం దెబ్బతింటది... భూమిని తినేస్తయవ్వి... భూమనేది బంగారుగుడ్డు పెట్టే బాతు వంటిది. రోజూ గుడ్డు పెట్టే బాతును దురాశతో ఒకేసారి బంగారు గుడ్లన్ని పొందాలని కోస్తె ఏమయింది...? బాతు చనిపోయింది కదా...! ఒకేసారి ఎక్కువ పంట పొందాలని రసాయనిక ఎరువులను విచక్షణారహితంగా వాడి భూసారన్నంత పీల్చివేస్తున్నం... దాంతోని భూమి భవిష్యత్తరాలకు ఉపయోగపడకుండవుతది... ఇది ఒక విధంగా భూమిని కాలుష్యానికి గురిచేసుడే...

భూమి అలుగుతె, రైతు అలుగుతె, ప్రకృతి అలుగుతె మన మనుగడేమైతది...? ప్రకృతి విలయాలిలతోపాటు ఇన్ని రకాల ప్రమాదాలున్నయి... శాశ్వతంగా ఎన్నో తరాలకు ఉపయోగపడాల్సిన భూమిని కొద్దికాలంలనే నిస్సారంజేత్తె భవిష్యత్తరాల సంగతేంటి...? ఇది ఒక విధంగా భవిషత్తు తరాలకు దారుణం చేసుడే కదా...! అదే విధంగా ప్రకృతిని గూడ కాపాడుకోవాలె... లేకుంటె మన బతుకు, మనుగడ కష్టమైతది...”



“బాగ జెప్పినవు రాజమల్లు... కాని మందులు వాడకుండ పంటలు పండించుడు సాధ్యమేనా...”

“ఎందుకుగాదు...? స్వాభావిక ఎరువులను మాత్రమే వాడితె భూమికి శాశ్వతత్వమస్తుంది... అవి తిన్న జీవరాశుల ఆయుః ప్రమాణం పెరుగుతుంది.

జహీరాబాద్ దగ్గరో ఊరుంది. అక్కడ వందలాది ఎకరాల భూములను ఎలాంటి రసాయనిక ఎరువులు లేకుండా సాగుచేస్తున్నరు. మందులేసి పండించిన దానికంటె ఎక్కువే పండుతంది పంట... దీనికి కారణం ఓ వ్యక్తి. అతడు తనకున్న పెద్ద నౌకరీ వదిలిపెట్టుకొని వచ్చిండు... ప్రయోగాత్మకంగ పని ప్రారంభించిండు. ఆ పనికే అంకితమయ్యిండు... ఎంతోమందికి ఉదాహరణయ్యిండు... ప్రకృతిని కాపాడుకునే విషయంల గూడగట్ల జేత్తె చాల సమస్యలకు పరిష్కారం దొరుకుతది...” అన్నడు రాజమల్లు... ✤

ఆటిసం - నివారించే అవకాశాలు

మానవుని మెదడు సరిగా పనిచేయకపోవడాన్ని ఆటసంగా పిలవడం జరుగుతుంది. దీనివల్ల మనిషి తన మనసులోని భావనలను ఇతరులకు సరిగా అందించలేకపోవడం, తనతోటి వారితో సంబంధ బాంధవ్యాలు ఏర్పరచుకోలేక పోవడం వంటి సమస్యలను ఎదుర్కొంటారు. కొన్ని సందర్భాలలో ఆటసం గల వ్యక్తులు అధిక మేధస్సును కనబరుస్తారు. తమ తెలివితేటలు, మాటలతో తన తోటి వారిని బహుముఖంగా ఆకట్టుకుంటారు. మరికొన్ని సందర్భాల్లో ఇది మానసిక వికలాంగతకు దారితీస్తుంది. లేదా మూగతనం, మాటలు సక్రమంగా రాకపోవడం వంటి అసాధారణ పరిస్థితికి మనిషిని ఆటసం తీసుకుపోతుంది. అదీ తీవ్రస్థాయికి చేరితే, సభ్య సమాజంలోకి ప్రవేశించడానికి ఆ వ్యాధిగ్రస్తులు భయపడటం, విచిత్రంగా ప్రవర్తించడం వంటి చర్యలకు పాల్పడతారు. ఈ వ్యాధి కలిగిన వ్యక్తులు అందరూ ఒకే తరహాలో ఉండరు. వారిలో రోగ లక్షణాలు, లోపాలు ఒక్కో విధంగా ఉంటాయి.



ఆటసం కలిగిన వ్యక్తులు కొందరు అసాధారణ ప్రతిభను కనబరుస్తారు. మరికొందరు సాధారణమైన వ్యక్తులకన్నా అమోఘమైన తెలివితేటలు కలిగి ఉంటారు. కొందరు తమ చిన్న వయస్సులోనే పెద్దలను కష్టమైన ప్రశ్నలతో ఇబ్బంది పెడుతుంటారు. కొందరు పిల్లలు మాట్లాడే సమయానికే రాయడం కూడా నేర్చుకుంటారు. కొందరు పిల్లలు అతి చిన్న వయస్సులోనే సంగీతాలాపన, వాయిద్యాలను వాయించడం వంటి చర్యలకు పాల్పడతారు.

అసాధారణమైన ప్రవర్తనను తల్లిదండ్రులు తమ పిల్లలలో ముందుగా గమనిస్తారు. కొన్ని సందర్భాల్లో వాటిని చిలిపి చేష్టలుగా తల్లిదండ్రులు భావిస్తారు. కొన్ని సందర్భాల్లో పిల్లలు విచిత్రమైన తరహాలో ప్రవర్తిస్తుంటారు. పిల్లలు ఒక్కసారిగా నిశ్శబ్దంగా ఉంటూ ఏదో ఒక్క విషయంపైనే తమ దృష్టిని సారిస్తారు. సాధారణంగా పెరిగే పిల్లల్లో ఆటసం వ్యాధి సంక్రమిస్తుంది. ఆ సమయంలో పిల్లలు ఒక్కసారిగా నిశ్శబ్దంగా ఉండటం లేదా తీవ్రంగా ఇతరులను దూషించడం లేదా తనను తాను దూషిమచుకోవడం, అల్లరిచేయడం వంటి చేష్టలకు పాల్పడతారు. అయితే ఇటువంటి సమస్యలపై తల్లి దండ్రులకు సరైన అవగాహన లేకపోవడంతో తమ పిల్లలకు తగిన వైద్య పరీక్షలు జరిపించలేకపోతున్నారు. పిల్లలు అందరూ ఇలాగే వ్యవహరిస్తారన్న భావన తల్లిదండ్రులకు కలగడం వల్ల వైద్య సహాయం సమయానికి సమకూరడం లేదు.

ఆటసం వ్యాధిని నిర్ధారించడానికి ఇంతవరకు ఎక్స్‌రేలుగానీ, రక్తపరీక్షలుగానీ అమలులో లేవు. ఆటసం వ్యాధి కలిగిన ఏ ఇద్దరు వ్యక్తులు కూడా ఒకే విధంగా ప్రవర్తించరు. మరికొన్ని కారణాలు కూడా ఆటసం లక్షణాలను సరిగా వెలుగులోకి రానివ్వవు. పిరికి సమస్య, సరిగా మాటలు రాకపోవడం, మానసిక వికలాంగత, నరాల బలహీనతలను తల్లిదండ్రులు గాని లేదా తమ పిల్లల వైద్యులు గాని సులభంగా గుర్తించలేకపోతున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో తల్లి దండ్రులు తమ పిల్లలను ఆటసం నిపుణుడి చేత పరీక్ష చేయించవలసిన అవసరం ఉంది. పిల్లల మానసిక వైద్యనిపుణుల చేత తల్లిదండ్రులు తమ పిల్లలను పరీక్షచేయించవలసి ఉంది.

ఆటసం వ్యాధి లక్షణాలను గుర్తించడానికి నిపుణులు పలురకాల పరీక్షలు నిర్వహిస్తారు. పిల్లలు మాట్లాడే తీరు, వారి ప్రవర్తన తదితర అంశాలను నిపుణులు పరిగణనలోకి తీసుకుంటారు. నిపుణులు రోగ నిర్ధారణ కోసం పిల్లల నుంచి పలురకాల సమాచారాన్ని సేకరిస్తారు. కుటుంబానికి సంబంధించిన 'ఫొటోలు, పిల్లల ఆల్బంలను వారికి చూపడం ద్వారా రోగ లక్షణాలను కొన్నింటిని గమనించవచ్చును. రోగ లక్షణాలపై అనుమానం తలెత్తినపుడు జన్యు పరీక్షలు, నరాల పరీక్షలను నిర్వహించవలసిన అవసరం ఉంది. మానసిక లోపాలను గుర్తించడానికి వైద్యులు మరికొన్ని మానసిక పరీక్షలను సైతం నిర్వహిస్తారు.

మెదడు సరైన రీతిలో నిర్మాణం జరుగకపోవడం లేదా అందులో కొన్ని లోపాలు ఉన్న కారణంగా ఆటసం వ్యాధి వచ్చే అవకాశం ఉందని వైద్య నిపుణులు నిర్ధారిస్తున్నారు. కొన్ని రకాల వైద్య పరికరాల ద్వారా మానవుని మెదడుతోపాటు కొన్ని రకాల జంతువుల మెదడును పరీక్షించిన అనంతరం వైద్యశాస్త్రవేత్తలు దానిపై సమగ్రమైన నిర్ధారణకు రాగలిగారు. ఇప్పటికే, మెదడు అతిగా పెరగడంవల్ల శాస్త్రవేత్తలు పరిశోధనలు కొనసాగిస్తున్నారు. ఆటసం వ్యాధి వల్ల మానసిక వికలాంగత అధికంగా ఉన్నట్టు శాస్త్రవేత్తలు గమనించారు. ఆటసం వ్యాధికి గురైనవారిలో 75-80 శాతం మంది మానసిక వికలాంగతకు గురైనారు. అందులో 15-20 శాతం మందిలో మానసిక వికలాంగత అత్యధికంగా ఉన్నట్లు గుర్తించడం జరిగింది.

ప్రస్తుతం ఆటసం వ్యాధిని అరికట్టడానికి పలు మార్గాలు అందుబాటులోకి వచ్చాయి. వ్యాధిని త్వరగా గ్రహించడం, ప్రత్యేక విద్య, తగిన వైద్య సహాయం ద్వారా దానిని చాలా వరకు రూపుమాపవచ్చును. మంచి వైద్య సహాయాన్ని అందుకునే వ్యాధిగ్రస్తులు విద్యపై అధిక శ్రద్ధ చూపగలరు. మానసిక వికలాంగత అధికంగా ఉన్నప్పటికీ, వైద్య సహాయం ద్వారా ఆ వ్యాధిగ్రస్తులు స్వయంగా తమ పనులు తామే నిర్వహించుకునేస్థాయికి తీసుకురావడం సాధ్యం అవుతుంది. చిన్న వయస్సులో మెదడు పెరిగే అవకాశం ఉంది, అటువంటి సమయంలో తగిన వైద్య సహాయాన్ని అందించడం ద్వారా ఉత్తమ ఫలితాలు సాధించవచ్చు. ✤

ఆహార పదార్థాలకు రంగులు - సంభవించే అనారోగ్యాలు

నేటి ఆధునిక (అ) నాగరిక సమాజంలో తినే ఆహారపదార్థాలు సయితం ఆకర్షణీయంగా వుండాలనుకోవడం సహజమయిపోతోంది. ఫలితంగానే ఆహార పదార్థాలు వివిధ రంగుల్లో... కనువిందు చేస్తున్నాయి. వాటిని అనుభవిస్తున్నామన్న ఆనందంలో 'మనిషి' వున్నాడేగాని తన దేహాన్నితానే శిధిలం చేసుకుంటున్న వాస్తవాన్ని మాత్రం గ్రహించలేకపోతున్నాడు.



కల్తీ వ్యాపారుల ధనదాహం... మనిషికి ఆధునిక నాగరికత ఆపాదించిన ఆకర్షణీయత... వెరసి... రంగురంగుల కృత్రిమ ఆహారపదార్థాలు. తర్వాత రకరకాల అనారోగ్య సమస్యలు. అసలు మనం తినే ఆహార పదార్థాలకు రంగులు ఎందుకువేయాలి? ఎవరైనా ఎప్పుడైనా ప్రశ్నించుకున్నారా? రంగుల వాడకంలో శాస్త్రీయ అవగాహన లేమి వలన మనం భుజిస్తోన్న ఆహార పదార్థాలు ఎన్ని అనారోగ్యాలకు దారితీస్తున్నాయో ఎంత మంది ఆలోచిస్తున్నారు? జబ్బులు రావడం, వైద్యుని సంప్రదించడం. ప్రతిసారి జరిగిపోతుందేగాని, అసలు ఈ జబ్బుల్లో అనేక జబ్బులకు కారణాలు ఏమిటో ఏనాడైనా తెలుసుకోవాలని అనుకున్నారా? గ్యాస్ట్రైటిస్‌కు గురైతే... మందులు వాడారేగాని, అసలు ఆ వ్యాధిని నిరోధించే ప్రయత్నం చేశారా? అలా చేసి వుంటే ఇవాళ ఇన్ని ఆరోగ్య సమస్యలు వుండేవి కావు. అనేక జబ్బులకు కారణమవుతున్న ఆహార పదార్థాలలో రంగుల వాడకంపై... వాటి అనారోగ్యాలపై శాస్త్రీయ అవగాహన కలిగించాలనే ఓ చిన్న ప్రయత్నమే ఈ వ్యాసం.

ప్రకృతిలో స్వభావసిద్ధమైన రంగులున్నాయి. వాటిలో క్యారెట్, బీట్‌రూట్, టమాటా, పసుపు, రెడ్‌చిల్లీస్ వంటివి పేర్కొనదగినవి. ఈ రంగులను కృత్రిమ పద్ధతుల్లో ఎక్స్‌ట్రాక్ట్ చేసి వాడుకోవచ్చును. అయితే వీటిని ఎక్స్‌ట్రాక్ట్ చేయడం అంత తేలికైనదికాదు. ఎంతో ఖర్చుతో కూడుకున్నది. అందువల్ల నేడు ఆ రంగులకు బదులు కృత్రిమంగా తయారు చేయబడిన చౌకబారు సింథటిక్ రంగులు వాడడం జరుగుతోంది. సాధారణంగా ఈ రంగులన్నీ కోల్‌తార్ రంగులు. పెట్రోలియం ఉప ఉత్పత్తులు. వీటిని ఎక్కువ మోతాదులో వాడడం ఆరోగ్యానికి హానికరం. అంతేకాక వీటిని నిదానగతిన... ఆరోగ్యాన్ని చివరకు ప్రాణాలను హరించే... విషపదార్థాలుగా అభివర్ణించడం జరిగింది.



రంగులు వేస్తున్న పదార్థాలు

అనారోగ్యకారకాలైన ఎన్నో రంగులను నేడు వాడడం జరుగుతోంది. వాటిలో కొన్నింటిని ప్రభుత్వం ఎప్పుడో నిషేధించింది. అయినా ఆ రంగుల వాడకం జరుగుతూనే వుంది. రంగులు వాడుతున్న ఆహారపదార్థాలలో జిలేబి, కొన్ని రకాల స్వీటులు, ఐస్‌క్రీములు, బిర్యానీ, బిస్కెట్‌లు, కేకులు, అప్పడాలు, వడియాలు, జంతికలు, పీచు మిఠాయి, షర్బత్,



పాఠశాలల వద్ద అమ్మే రంగు నీళ్ళు (చౌక బారు శీతల పానీయాలు) సోంపుగింజలు, కందిపప్పు, పెసరపప్పు, పచ్చిబఠాణీలు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో దొరికే సాస్‌లు, జామ్‌లు, జెల్లీలు, కస్టర్డ్‌లు, మసాలా పొడులు మొదలయినవి. రంగులలో... మెటానిల్ ఎల్లో, రోడమిన్-బి ఆరెంజ్ - జి నిషేధించబడినవి. అయితే ఐ.ఎస్.ఐ మార్క్ కలిగిన రంగులు వాడవచ్చును. వాటినైనా ఎక్కువ మోతాదులో వాడితే ప్రమాదకరమేనని పరిశోధనలు తెలుపుతున్నాయి. పచ్చరంగు కొరకు సన్‌సెట్ ఎల్లో, ఎరుపురంగు కొరకు ఇండిగోమైన్ రంగులు వాడవచ్చును. అయితే ఈ రంగులు కూడా... పసుపు, కారం, కందిపప్పు, శనగపప్పు, పెసర పప్పు మొదలయిన నిత్యావసర పదార్థాలలో వాడడం నిషేధించబడింది.

అనారోగ్యపు అనర్థాలెన్నెన్నో...

నిషేధించబడిన రంగులవాడకం, అనుమతించబడిన మోతాదును మించి వాడడం వినియోగదారుల్లో అనారోగ్యపు అనర్థాలకు కారణమవుతున్నాయి. ఒక కి.గ్రా. పదార్థానికి అనుమతించబడిన ఏ రంగైననూ 100 మి.గ్రాలకు మించి వాడరాదు. ముఖ్యంగా మెటానిల్ ఎల్లో రంగువాడకం వల్ల జీర్ణాశయం వ్యాధిగ్రస్థమవుతుంది. సహజ జీర్ణప్రక్రియ అస్థవ్యస్తమవుతుంది. దీర్ఘకాలం ఈ రంగువాడిన పదార్థాలు భుజించడం వల్ల వీర్యకణాలు దెబ్బతింటాయని పరిశోధనల్లో తేలింది. ఆరెంజ్-జి వాడడంవల్ల కాలేయం, మూత్రపిండాలు దెబ్బతింటాయి. రోడమిన్ -బి రంగు పెరుగుదల మందగించేలా చేస్తుంది. రక్తంలోని ఎర్రరక్తకణాలపై దుష్ప్రభావం చూపుతుంది. దేహంలోని రోగ నిరోధక వ్యవస్థను బలహీనపరుస్తుంది. మహిళల్లో ప్రత్యుత్పత్తి సమస్యలు, రుతుస్రావ సంబంధ అసాధారణతలు తలెత్తుతాయి. రంగుల వాడకంవల్ల సంభవించే వ్యాధులు దీర్ఘకాలిక వ్యాధులు కావడంతో వినియోగదారులు వీటిపై దృష్టిని కేంద్రీకరించడం లేదు. అందువల్లనే రంగుల వాడకం యథేచ్ఛగా, విచక్షణారహితంగా జరిగిపోతోంది. వ్యాధుల లక్షణాలు బయటపడేటప్పటికి ఆరోగ్యపరిస్థితి చాలా సందర్భాలలో చేయిదాటిపోతోంది. శరీరంలో ప్రతి అవయవం మీద వీటి ప్రభావం వుంటుంది. క్యాన్సర్ వచ్చే అవకాశాలు పెరిగిపోతున్నాయి.

మెదడును మొద్దుబారిస్తున్నాయి. కొందరు గర్భిణీస్త్రీలలో... పిండం అంగవైకల్యానికి కూడా కారణమవుతున్నాయి. కృత్రిమ సింథటిక్ రంగుల వాడకం వల్ల క్రోమోజోములు, వాటి జన్యువులు అసాధారణ మార్పులకు గురి అవుతున్నాయి. ఈ అనవసర రంగుల వాడకంపై ప్రతి ఒక్కరు స్పందించాలి. ఆకర్షణకులోను కాకుండా... ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత యివ్వాలి. నిషేధితరంగులు వాడిన ఆహార పదార్థాల తయారీదారులపై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలి. ఎవరికి వారు మనకెందుకులే అనుకుంటే సమస్య పరిష్కారం కాదు.

జోగినీ దురాచారం

తరతరాల దురాచారంపై సమగ్ర కథాత్మక రచన 'జోగిని' నవల. శాంతి ప్రబోధగారు రాసిన ఈ నవల క్షేత్ర పరిశీలన ఆధారంగా రచించబడింది. మతం పేరుతో ఆడపిల్లలను దేవునికో, దేవతకో అర్పించటమనేది అనాదిగా జరుగుతున్న దురాచారం. దేవాలయాల్లో నృత్యంచేసి, మృదుమధురమైన తమ గాత్రాలతో దేవుళ్లకు అర్పణమైన వారు దేవదాసీలు. సంగీత, నాట్య శాస్త్రాలను అభ్యసించి, పండితుల దగ్గర మెప్పులు పొందిన కళాకారులే వీరు. ఏనాడైతే నాట్యవిద్యకు గౌరవం తగ్గిందో, ఆనాటి నుంచి ఆ కళాకారులు తమ గౌరవాన్ని పోగొట్టుకొని నాట్య, సంగీత విద్యలకు దూరమైనారు. వీరు వెనకబడ్డ కులాలకు చెందినవారు. దళితులకు దేవాలయ ప్రవేశం నిషేధింప బడింది. అంటరానివారుగా ఊరిబయట జీవించాల్సిన పరిస్థితుల్లో అక్కడే గూళ్లు కట్టుకొని పూజలు నిర్వహిస్తూ, వారి ఆడపిల్లలను దేవతలకు అంకితం చేయనారంభించారు. దీనికి సామాజిక, చారిత్రక కారణాలు ఎన్నో ఉన్నాయి. అతిహేయమైన ఈ దురాచారం నేటికీ నజీవంగా కొన్ని ప్రాంతాల్లో నిలిచిఉంది.

పై నేపథ్యంలో వచ్చినదే జోగినీ వ్యవస్థ. దక్షిణ భారతదేశమంతటిలోనూ ఇది వ్యాపించింది. ఆంధ్రదేశంలో తెలంగాణా ప్రాంతంలో జోగినులుగా, కోస్తా ప్రాంతంలో మాతంగులుగా, రాయలసీమలో బస్విసులుగా పిలుస్తున్నారు. కర్ణాటకలో వీరిని దేవదాసీలు లేక బస్వీలనీ, మహారాష్ట్రలో మురలీలనీ, తమిళనాడులో మరియమ్మలనీ, గోవాలో ఖాలిన్లనీ పిలుస్తారు. ఆర్థిక, సామాజిక మార్పుల వల్ల, నైతికవిలువల పతనమైన కారణంగా, గ్రామ కామందులు, భూస్వాములు కామతృష్ణవల్ల, ఈ వ్యవస్థ క్రమేపీ నీతి బాహ్యస్థితికి దిగజారింది. ఈ దురాచారాన్ని నిర్మూలించడానికి అనేక శాసనాలు జారీఅయ్యాయి. 1913లో నిజాం రాష్ట్రానికి చెందిన భాగ్యరెడ్డివర్మ ఈ దురాచారాన్ని పోగొట్టడానికి కృషి సల్పాడు. ఆ తర్వాత కాలంలో 1985లో శ్రీమతి ఆశామూర్తి జిల్లా కలెక్టరుగా నిజామాబాద్‌లో పని చేసినప్పుడు, అక్కడ ప్రబలమైన ఈ దురాచారాన్ని గ్రహించి, అధ్యయనంచేసి, ఒక చక్కని నివేదికను సమర్పించారు. అప్పటి గవర్నర్ కుముద్‌బిన్ జోషి, జోగినీ వ్యవస్థ నిర్మూలనకు కృషిచేసి దేవదాసీ విధాన నిర్మూలన చట్టాన్ని 1988లో తెచ్చారు. ఆమె ఆధ్వర్యంలో నిజామాబాద్‌జిల్లా వర్నిలో 'చెల్లి నిలయం' ఏర్పడింది. శ్రీమతి హేమలతాలవణం (ఈ సంఘం సేవకురాలిని అమ్మగా పిలుస్తారు). ఈ దురాచారాన్ని పోగొట్టడానికి నిర్విరామకృషి నేటికీ కొనసాగిస్తున్నారు. ఆమె రాసిన గేయం నుంచి ఈ క్రింది వాక్యాలను ఉదాహరణగా పేర్కొనవచ్చు. అది.

"ఎవరు చేశారమ్మనిన్నిలా
వెన్నెలా నీ బతుకు వాడినా జోగిలా
ఓ పోశాని చెల్లీ, లచ్చువ తల్లి..."

జోగినులను ఊరుమ్మడి ఉంపుడు గత్తెలుగా మార్చడానికి కారణాలు దారిద్ర్యం, అజ్ఞానం, అంటరాని తనం, అమాయకత్వంగా విశ్లేషించారు. 'అమ్మ' దేవీలను రచయిత్రి ప్రస్తావించటం నవలకు సమకాలీనతను, ప్రాసంగికతను సమకూర్చింది. జోగినీ వ్యవస్థను రూపుమాపే ప్రయత్నంలో ఎందరో అభాగినులు మంచి జీవితాన్ని ఆరంభించారు. అందులో చెప్పుకోదగ్గవారే పోశవ్వ, సాయవ్వలు.

జోగిని
రచన: వి. శాంతి ప్రబోధ
పేజీలు: 170,
వెల: రూ. 60,
ప్రతులకు: ప్రజాశక్తి బుక్‌హౌస్
1-1-187/1/2
హైదరాబాద్

పోశవ్వ స్వయంకృషి ద్వారా సర్పంచ్ అయి, ఢిల్లీ దాకా వెళ్లింది. మండల ప్రెసిడెంటుగా, దళిత ఉద్యమ కారిణిగా, మహిళోద్యమ కార్యకర్తగా, అవార్డు పొందటం, ఇలాంటి వివరణలతో రచయిత్రి దళిత మహిళకీ గౌరవంగా జీవించే హక్కుందనీ, సమాజాన్ని నిలదీసి ప్రశ్నించే హక్కుందన్న విషయాన్ని నవలలో ఎలుగెత్తి చాటింది.

శాంతి ప్రబోధ రాసిన 'జోగిని' కథాకథనం ఆసక్తిగా ఉంది. పండుగ సంబరాలను గూర్చి, జోగినులను చేసే కర్మకాండను, గావు పట్టడాన్ని, వారి జీవితాల్లో కల్లు, సారాయిల పాత్ర మొత్తంగా జోగినుల జీవిత విధానాన్ని విపులంగా వర్ణించారు నవలా రచయిత్రి. పాత్రోచితభాషను, నుడికారాన్ని రచనలో పొందుపరచింది. భూస్వామ్య పెత్తందారీ విధానం, అంటరానితనం, అణచివేత, మూఢవిశ్వాసాలు, ఆచారాలు, స్త్రీ వివక్ష సమాజంలో బలంగా ఉండడమే తీవ్రవాద ఉద్యమ ఉధృతికి కారణమేమోనన్న రచయిత్రి అభిప్రాయం ఆలోచించదగ్గదే!

శాంతి ప్రబోధగారి నవల జోగినుల జీవితాన్ని ప్రతిబింబిస్తూ వారి సమస్యలకు పరిష్కారం చూపే దిశలో ఉండటం అభినందనీయం. సామాజిక స్పృహతో కూడిన ఇంత మంచి నవలను ప్రజాశక్తి బుక్‌హౌస్ వారు ప్రచురించటం హర్షదాయకం.

-డా॥ వకుళాభరణం లలిత

స్వీకారం

రావి పొదుపు కథలు
రచయిత: డా॥ రావి రంగారావు
వెల: రూ. 18/-
ప్రతులకు: 4-290, గొడుగుపేట, మచిలీపట్నం-521001



ప్రజాపునాది విస్తరణకు ప్రతిష్ఠ నిర్మాణం
రచయిత: బి.వి. రాఘవులు
వెల: రూ. 25/-
ప్రతులకు: ప్రజాశక్తి బుక్‌హౌస్ 1-1-187/1/2 చిక్కడపల్లి హైదరాబాద్.

కాన్‌కున్, జెనీవా కపట నాటకాలు
రచయిత: వేములపల్లి వెంకట్రామయ్య
వెల: రూ. 8/-
ప్రతులకు: ప్రజాపంథా, మార్క్స్ భవన్, ఇం.నెం. 658, విద్యానగర్, 7వ లైన్, హైదరాబాద్.

ప్రకృతిసిద్ధటూరిజం

కోరుకొండ - పాండవులమెట్ట

బౌద్ధ క్షేత్రాలకు ఉన్న ప్రత్యేకత తూర్పుగోదావరి జిల్లా కోరుకొండలోని పాండవులమెట్టను సందర్శిస్తే అర్థమవుతుంది. క్రీస్తుపూర్వమే బౌద్ధం ఈ నేలపై విస్తరించిందనటానికి ఈ ప్రాంతం సాక్షిభూతంగా నిలుస్తోంది. పురావస్తు తవ్వకాల్లో బయటపడ్డ బౌద్ధచిహ్నాలు పర్యాటకులను ఆకర్షిస్తున్నాయి.



పాండవుల మెట్ట ఏరియల్ వ్యూ

నాంబత్తుల రాంబాబు

తూర్పుగోదావరి తో పాటు గుంటూరు, కృష్ణ, విశాఖ పట్నం, విజయ నగరం, శ్రీకాకుళం, ప్రకాశం, కడప, కరీంనగర్, పశ్చిమ గోదావరి జిల్లాల్లో బౌద్ధఆనవాళ్లు ఉన్న విషయం ప్రత్యేకించి చెప్పనక్కర్లేదు. వాటికి ధీటుగా కోరుకొండ ప్రాంతాల్లో బౌద్ధుల కాలం నాటి విశేషాలు వెలుగుచూశాయి. ఇక్కడ దొరికిన అవశేషాలు బౌద్ధ చరిత్రను చాటుతున్నాయి.

తూర్పుగోదావరి జిల్లాలో మండల కేంద్రమైన కోరుకొండకు రెండు కిలోమీటర్ల దూరంలో పాండవులమెట్ట ఉంది. యాత్రికులు రాజమండ్రి నుంచి 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న కోరుకొండకు బస్సు ద్వారా చేరుకుంటారు. రాజమండ్రి బస్సు డిపోలో ఉదయం 5గంటల నుంచి రాత్రి 10గంటల వరకూ కోరుకొండ బస్సులు అందుబాటులో ఉంటాయి. ప్రతీ అరగంటకు ఒక సర్వీసును ఆర్‌టిసి నడుపుతోంది. దీనికి ప్రత్యేకించి రైలురూటు లేదు. కోరుకొండ చేరుకున్న యాత్రికులు అక్కడ నుంచి సీతానగరం వెళ్లే రూటులో ఆటోల ద్వారా పాండవుల మెట్ట చేరుకోవచ్చు. గుహల దగ్గర ఉన్న పురావస్తుశాఖ ఉద్యోగి యాత్రికులకు ఓర్పుగా బౌద్ధ ప్రాముఖ్యతను తెలియ జేస్తున్నారు. ఇక్కడికి వచ్చేవారిలో యువత ఎక్కువ. వీరంతా బౌద్ధ అవశేషాలు పరిశీలించి ఉద్యోగి చెప్పినది విన్న తరువాత ఇక్కడికి సమీపంలోనే ఉన్న లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి వెళుతుంటారు. పాండవులమెట్టపై నివసించేప్పుడు పాండవులు



కొండపైకి దారి

లక్ష్మీనరసింహస్వామిని దర్శించేవారని చెప్పుకుంటుంటారు. పొద్దుపోయాక ఇక్కడికి వచ్చే యాత్రికులకు వసతులు లేవు. వారు పాండవులమెట్ట నుంచి కోరుకొండకు వెనక్కి వెళ్లి హోటళ్ళు, లాడ్జీలలో బస చేస్తారు. పురావస్తుశాఖ ఈ ప్రాంతాన్ని పర్యాటకప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు 80లక్షలు కేటాయించింది. రెండేళ్ల క్రితం మొదటి దఫాగా 45 లక్షలు, తరువాత మరో 35లక్షలు విడుదల చేసింది. ఇదే ప్రాంతంలో చదువుకున్న పురావస్తుశాఖ రాష్ట్ర డైరెక్టర్ బౌద్ధ అవశేషాల వెలికితీతలో కీలకపాత్రధారిగా చెప్పుకొంటుంటారు.



గుహలకు ఎదురుగా లక్ష్మీనరసింహస్వామి దేవాలయం

పాండవులమెట్ట బౌద్ధ చరిత్రకు సజీవ సాక్ష్యంగా నిలుస్తోంది. రెండేళ్లుగా పురావస్తు తవ్వకాలలో బౌద్ధ కాలంనాటి కట్టడాలు, రాళ్ళు, ఇటుకలతో నిర్మించిన బౌద్ధ చైత్యాలు, బౌద్ధ ఆరామాలు, ప్రదక్షిణ పద్య, గుహలలోకి వెళ్లేందుకు రాతితో నిర్మించిన మెట్లు, డ్రైనేజి వ్యవస్థ వంటివి బయటపడ్డాయి. ఆనాటి బౌద్ధ వైభవానికి ఇవి దర్పణాలు. ఇంతటి విశిష్ట బౌద్ధ చారిత్రక ప్రదేశం జిల్లాలో మరెక్కడా లేదని పురావస్తుశాఖ భావిస్తోంది. పురావస్తుశాఖ తవ్వకాల్లో బయటపడిన అతిపెద్ద రాతి బౌద్ధచైత్యంతో పాటు, మరో చిన్నచిన్న స్థూపాలు పర్యాటకులకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అర్థచంద్రాకారంలో మట్టి ఇటుకలతో నిర్మించిన అతిపెద్ద చైత్యం పురావస్తుశాఖను అబ్బురపరిచింది. బౌద్ధ సన్యాసులు విశ్రాంతి కోసం నిర్మించుకున్న కట్టడం కొత్తగా చేసిన తవ్వకాల్లో బయట పడింది. నాలుగు వైపులా రాతితో నిర్మించిన ప్రహరీ, దానిపై నిర్మించిన కట్టడాలు ఆనాటి నైపుణ్యాన్ని చాటుతున్నాయి. ఈ కట్టడానికి ఉత్తరం, దక్షిణాల వైపు బౌద్ధ సన్యాసులు నివసించేందుకు వీలుగా గదుల నిర్మాణం, నాడు వినియోగించిన మట్టికుండలు ఈ గదుల్లోనే దొరికాయి. ఇటుక మహా చైత్యానికి చుట్టూ నాలుగు స్థూపాలున్నాయి. దీనివక్కగా తూర్పువైపున మెట్లున్నాయి. ఈ కొండపై బయటపడిన మహాచైత్యం దేశంలో ప్రస్తుతం వున్న మహా స్థూపాల్లో ఒకటి కావచ్చన్న అభిప్రాయం పురావస్తు శాఖ అధికారులకు కలుగుతోంది. దీనితో బయటపడ్డ అవశేషాల స్థానే నేడు పురావస్తుశాఖ ఇటుకలు, రాయి, సున్నం కలిపి కట్టడాలను నిర్మించింది. ప్రస్తుతం తవ్వకాలు చేపట్టిన 32 ఎకరాల విస్తీర్ణాన్ని నాలుగు బ్లాకులుగా విభజించి అభివృద్ధి చేసింది. కొండ పైభాగానికి వెళ్లేందుకు వీలుగా ఇనుపరాడ్లను ఏర్పాటు చేసి మెట్లను నిర్మించారు. చూట్టూ పచ్చని పొలాల తో కనువిందు చేస్తున్న ప్రాంతాలను తలపించేలా కొండ పై భాగంలోనూ పచ్చని చెట్లను పెంచారు. నిరంతరం హడావిడిగా గడిపే ఆధునిక ప్రజలకు ఈ ప్రదేశం ప్రశాంతతను చేకూరుస్తోందని యాత్రికులు చెబుతున్నారు. ✤

భావకవిత్వానికి మార్గదర్శి రాయప్రోలు

ఎల్. నెహ్రూ

"ఏ దేశమేగినా ఎందుకాలిడిన
ఏ పీఠమెక్కినా యెవరెదురయిన
పొగడరా నీ తల్లి భూమి భారతిని
నిలుపరా నీ జాతి నిండు గౌరవము
లేదురా యిటువంటి భూదేవి యెందు
లేదురా మనవంటి ధీరులింకెందు"

భక్తితో భరతపుత్రుడువంటూ, భక్తితో పలుకమని గొంతెత్తి గానమొనర్చిన జాతీయకవి రాయప్రోలు సుబ్బారావుగారు. 1892 మార్చి 13న గుంటూరు జిల్లా గార్లపాడు గ్రామంలో జన్మించారు. విద్వాంసుల సాన్నిహిత్యం ఏర్పడుట వలన ప్రతిభావంతులై సుబ్బారావు గారు నూనూగు మీసాల వయస్సునాడే కవిత్వం చెప్పడం ఆరంభించారు. వారి విద్యాభ్యాసాలు పలు ప్రాంతాలలో సాగింది. గుంటూరు, క్రైస్తవ కళాశాలలోను, హైదరాబాదు నిజాం కాలేజీలోనూ సామాన్య విద్యను అభ్యసించారు. పలు పట్టణాలలో నుంచి చివరకు శాంతినికేతన్ గురుదేవులగు రవీంద్రుని సన్నిధానమున కవితా కళా రహస్యాలు అవగాహన చేసుకున్నాడు.

రాయప్రోలు రచనల్లో దేశభక్తి

రాయప్రోలు వారి రచనలో దేశభక్తి తొణికిసలాడుతుంది. వారి రాష్ట్రాభిమానం నిరుపమానం. ఆంధ్రుల ప్రాచీన చారిత్రక విశేషాలను వారు స్మరించిన తీరు అనితరసాధ్యం. "ఆంధ్రావళి" "తెనుగుతోట" అనే వీరి రెండు కావ్యాలు ఇందుకు నిదర్శనాలు.

వీరిని గూర్చి ప్రశంసించుచూ డాక్టర్ దివాకర్ల వెంకటావధానిగారు వారి కావ్యాలన్నింటా జాతీయత తొణికిసలాడుతుందని అంటారు.

"దేశీయ సంప్రదాయాలను కూడా మనోహరంగా వర్ణించుచూ వాటిద్వారా దేశభక్తిని ఉద్దీపింపచేశారు. వారి కవితల్లో దేశమాత సర్వసంపదలూగల మహాధాత్రిగా, సకల గుణచారియగు సాధ్వీమ తల్లిగా దర్శనమిస్తుంది.

"అమరావతి పట్టణాన బౌద్ధులు విశ్వవిద్యాలయాలు'' మొదలగు గీతాలు తెలుగువారు నేటికీ తన్మయత్వంతో పాడుకొనుట గమనించవచ్చు.

ఆంధ్రుల ప్రత్యేక రాష్ట్రానికై పోరాడుచున్న దినాలలో రచించిన "ఆంధ్రావళి" పద్య సంకలనం గ్రంథం ఆంధ్ర రాష్ట్ర ఉద్యమానికి స్ఫూర్తి నిచ్చింది.

"దాత్మలేదు చావలేదు ఆంధ్ర జన మహోజ్వల చరిత్ర హృదయాలు చీల్చి చదువుడో సదయులార"

అని నిండైన ఆదరాభిమానంతో గానమొనర్చారు. ఆంధ్రభాష అంటే వీరికి మక్కువ ఎక్కువ.

"కాలదయేని పునర్జన్మ! కలుగు గాక మధుర మధురంబయిన తెనుగు మాతృభాష" అని తన, భాషాభిమానాన్ని చాటుకొన్నారు.

"మేలుకోవోయ్ భరతపుత్ర
మేలుకోవోయ్
పిలుచుచున్నది వీరభారతి

అన్న రాయప్రోలు పిలుపుతో ఆంధ్రాభాషా సంఘం జాతీయాభిమానంలో ఒక శాఖగా పెంపొందింది. ఆంధ్ర రాష్ట్రావతరణకి ఇది నాంది అయింది.

విస్ఫోటనం

నువ్వు పరిచయమయ్యావు
క్షణం క్రితం నువ్వెవరో తెలియదు
కాసేపు మాట్లాడుకుందామా...
వద్దనుకున్నా వెన్నెముక వంగింది
స్పష్టాస్పష్టంగా నువ్వు
ప్రపంచాన్ని జయించిన అలెగ్జాండరా
చేతులు పైకెత్తి పూధ్చుమన్నావా
ఒక రాజ్యం ఇంకో రాజ్యంపై
ఒక సమూహం రాజ్య పౌరులపై
నిరాఘాటంగా దోపిడి

కాసేపు రాజకీయాలు మాట్లాడుకుందామా.
రాజ్యాధికారం అవుతుందేమో!

అంతా మన మంచికే అనుకుందాం
ఆకలిదప్పులు అతి సహజం అనుకుందాం
చచ్చేదెవరు... చంపించేదెవరనుకుందాం
అగ్గిపెట్టెలో బూడిదైన చీర
మళ్ళీ మళ్ళీ రాలుతున్న దూదిపూలు
పజిల్ విప్పు చూద్దాం

టైం పాసుగా కాస్త పిజ్జా తిందాం
ఇక నేల గర్భాన వరికంకుల విస్ఫోటనం

ఓ రహస్యం గుట్టు విప్పనా
నాకు ముసలితనం లేదు
ఎక్కడో పేలుతూనే ఉంటాను

-యెన్నం ఉపేందర్

కవితా విశేషాలు:

ప్రాచీన ఆంధ్ర కవిత్వానికి నన్నయను ప్రారంభకుడిగా తలచారు. అలాగే ఆధునిక ఆంధ్ర కవిత్వానికి రాయప్రోలు వారే ఆరంభమని విమర్శకులు అంటారు. "లలితతృణకాంకణం", "మిత్రమంజరి" "కష్టకమల" మొదలగు కృతులు రాయప్రోలు గారికి అఖండ ఖ్యాతిని ఆర్జించిపెట్టాయి.

వీరి కవిత్వంలో ప్రాచీనతపై గౌరవం సుస్పష్టమవుతుంది. కాని కవితా రీతిలో మాత్రం నూతన సిద్ధాంతాలవే పైచేయి. "పూర్వలక్షణాలను దిద్దడం నా లక్ష్యం కాదు. నవ్యకావ్య దృష్టిని చూపడమే నా లక్ష్యం" అని రాయప్రోలువారు ప్రకటించారు. వీరు రచించిన "తృణకంకణం" అనే కావ్యమే ఆ తరువాత పుంఖాను పుంఖాలుగా ఆంధ్రసాహిత్యంలో వెలువడిన భావకవిత్వాలకు మూలమని చెప్పవచ్చును. స్నేహలతాదేవి వ్రాసిన లేఖ ఇతివృత్తంగా "స్నేహలతా

దేవి", "కష్టకమల" అనే కథాకావ్యాలు రాశారు. అవి కరుణరస ప్రధానంగా సాగాయి. వీరి కవిత్వంలో ప్రబోధం ఉత్తమ కవితా లక్షణాలతో మాత్రమేకాక పఠనీయంగా ఉంటుంది. ప్రకృతిశోభ, స్నేహ మాధుర్యం, దేశభక్తి మొదలగు సుగుణాలు కలగలిసి వుంటాయి. భయనక, బీభత్సాది రసాలు కూడా ఈ కవి చేతిలో శాంతరసమై ప్రవహిస్తాయి.

పచ్చిపాడియావు వంటిది కావ్యంబు
లేగ గుడిపి చేపురాగ దవ్వి
విడుక నమృతమిచ్చు, పొదుగు గ్రుద్దితివేని
కాలు విసరు, జున్నుపాలు రావు"

అన్నది కవి రాయప్రోలువారి విశ్వాసం.

(మార్చి 17 రాయప్రోలు సుబ్బారావు జయంతి సందర్భంగా)

తెగిన శారదవీణా తంత్రి

జింకపిల్ల బెదురుగావచ్చి పగబట్టిన పాముతోక తొక్కింది
తలదాచుకున్నా కసాయివేటు తప్పలేదు మేకపిల్లకి
పరీక్ష బలిపీఠం అయింది
సరస్వతి నెలవులో చదువులతల్లి ఒడిలో అక్షరాల చెల్లి నేలకొరిగింది
బంగారుపతకం రక్తపుటేరులో కొట్టుమిట్టాడింది
శారదవీణకి తీగతెగి అపశృతి పలికింది
అక్షరమాలలు అంజలి ఘటించాయి కన్నీటి సుమాలతో
గంగిగోవులుకొన్ని, గోముఖ వ్యాఘ్రాలు కొన్ని
మూగబోయిన సెల్‌ఫోనులు కొన్ని
మనిషి మాస్కులు తొడుక్కున్న రాబోట్లుకొన్ని
మానవత్వం మచ్చుకైనాలేని మనీపర్సులుకొన్ని,
ప్రాణాల్ని సేఫ్‌లాకర్లో సేవ్‌చేసుకున్న ఐరన్‌హార్టులు కొన్ని...
గాయపడ్డ పావురాల్ని రక్షించే సిద్ధార్థులు లేరక్కడ
మాంసాన్ని కోసి దానమిచ్చే శిబి చక్రవర్తులు లేరక్కడ
పిడికెడు ధైర్యాన్ని పిడికిలిగా బిగించే ధీరులు లేరక్కడ
చీమలకున్నంత సంఘనీతి చీమ తలకాయంతున్నా సర్పాన్ని పట్టి విషం కక్కించేవాళ్ళు
గడ్డిపోచల గుండెబలం గడ్డిపరకంత వున్నా మదపుటేనుగును బంధించేవాళ్ళు
సింహం ఆకలేసినా గడ్డి కతకదు...
లాఠీ సింహాలు నేరస్తుల రక్షణకు నానాగడ్డీ కరుస్తాయి
రక్షణ వలయాలే భక్షకులకు కవచాలు
బతికుండగా దాహంతీర్చలేనివాళ్ళు చచ్చినాక సమాధిమీద పాడావుని కట్టినట్టు
బోనుల్లో పులుల్ని వదిలేస్తారు చేపపిల్లలకు వల విసరడానికి
మృగరాజుకి అడవిలో రోజుకో జంతువు ఆహారం
హైటెక్ శాడిస్టులకి ప్రసన్నలక్ష్మి, శ్రీలక్ష్మి, వరలక్ష్మి...
గంటకో లక్ష్మి ఆహారం

-జి. విజయలక్ష్మి

(విజయవాడ శారదా కళాశాలలో మనోహర్ ప్రేమవేటుకి బలై, మార్చి 1 నుండి కోర్టు విచారణలో మళ్లీ బలౌతున్న శ్రీలక్ష్మికి అంకితం)

ADVOCATE

న్యాయసలహాలు

జి.ఎల్.నరసింహారావు, హైకోర్టు న్యాయవాది

సాక్ష్యం ముఖ్యం

నాతోటి ఉద్యోగుల ఇంటిప్రక్కన ఉన్నవారితో పరిచయం అయ్యింది. నా అవసరము నిమిత్తం వారిని డబ్బు అప్పుఅడిగాను. మాకు తెలిసినవారింటి దగ్గర ఉన్నావు, ఎంత డబ్బు కావాలని అడిగారు. పదివేలు అవసరమని అన్నాను. వెంటనే డబ్బుఇచ్చినారు. ఇచ్చిన పదిరోజులకు ఒక ఖాళీ ప్రాంసరీనోట్‌పై సంతకం పెట్టమంటే పెట్టాను. నాకు డబ్బు ఇచ్చినపుడు సాక్షులు ఎవరు లేరు. నాకు జి.పి.ఎఫ్ లోన్ ఇరవై వేలు అందగా నేను పదివేల రూపాయలు ఇచ్చాను. సాక్షులు ఇచ్చినపుడు ఎవరులేరు. మంచివారని నేను ఖాళీ ప్రాంసరీనోటు అడగలేదు. కొళాయి దగ్గర మా ఆవిడకు వారికి తగువు అయినది. ఇప్పుడు మరల వారు మాకు 20వేలు బాకీ అంటున్నారు. ఏమి చేయాలి. నాకు డబ్బు ఇచ్చినపుడు సాక్షులు లేరు. నేను ఇచ్చినపుడు సాక్షులు లేరు. తమరు నాకు సలహా ఇవ్వగలరు.

కె. రమణమూర్తి, ఎం.పి.డి.ఓ ఆఫీసు
కొమరాడ మండలం

మీకు డబ్బులు ఇచ్చినప్పుడు సాక్షులు లేరు. కాని తరువాత ప్రోనోటు సాక్ష్యాన్ని మీరు ఇచ్చారు. మీరు డబ్బులు ఇచ్చేటప్పుడు సాక్షులులేకున్నా, మీరు రశీదు తీసుకోలేదు. న్యాయస్థానంలో మంచివారా చెడ్డవారా అనేదికాదు. 'సాక్ష్యం' ముఖ్యం. మీ సంతకంతో ఉన్న ప్రోనోటు వారివద్ద ఉంది. కాబట్టి వారు 20,000 అని వ్రాసుకుని ఉండవచ్చు. మీ తోటి ఉద్యోగుల ద్వారా అడిగించి చూడండి. మీరే మాట్లాడి సరిచేసుకోండి. లేదంటే అతడు దావా వేస్తే మీ వాదన వినిపించుకొని మీరు పై ప్రోనోటు భాగంలో ఏమీ వ్రాయలేదు అని నిరూపించుకోవాల్సి ఉంటుంది.

మాకు డబ్బులు ఏమైనా వస్తాయా?

మాది పేద కుటుంబం. మా నాన్నగారు చిన్న హోటల్ పెట్టి మమ్మల్ని పోషిస్తున్నారు. మా నాన్నగారి పేరుమీద రోజుకి 10రూ. చొప్పున 1999 సం॥ నుండి మూడు సంవత్సరాల తొమ్మిది నెలలకి సహారా ఇండియాకి కట్టారు. అది పూర్తి అవ్వకముందే మా నాన్నగారు 2002 సంవత్సరం మే 30న చనిపోయారు. మేము కట్టిన డబ్బులు మాకు వస్తాయా? మా ఏజెంట్‌ని అడిగితే ఇదిగో, అదిగో అంటున్నారు తప్ప సరిగా చెప్పడం లేదు. సార్ మాకు తెలియదండీ. మీరే సలహా చెప్పాలి.

ఒక సోదరి
శ్రీకాకుళంజిల్లా

మీరు మీ ఏజెంట్‌నడిగి వారి ఆఫీసులో సంప్రదించండి. అప్పటికీ వారు మీకు న్యాయం చేయకపోతే. మీరే రిజిష్టర్డ్ పోస్టులో ఆ ఆఫీసు పేరిట వాస్తవాలు వివరిస్తూ నోటీసు పంపించండి అప్పటికీ చర్య తీసుకోకుంటే మీ దగ్గర ఉన్న అన్ని కాగితాలను మీకు వచ్చిన అకనాలెడ్జ్‌మెంట్‌తో సహా 4 జిరాక్స్‌లు తీసుకున్న వారి ఫోరంకు పంపండి. వారే మీకు నష్ట పరిహారాన్నిప్పిస్తారు. మీ డబ్బులు మీరు తిరిగి పొందగలరు.

పెద్దల్లుడు కేసువేస్తే...?

నాకు బిడ్డను ఇచ్చి పెండ్లిచేసిన మామకు 42 ఎకరాల సొంతపొలం ఉంది. రెండు మిద్దెలు ఉన్నాయి. అతనికి ఇద్దరు కొడుకులు, ముగ్గురు బిడ్డలు, అందరి పెండ్లిండ్లు అయిపోయినాయి. ఆస్తిపంపకం చేస్తాను రమ్మని ముగ్గురు బిడ్డలకు. అల్లుళ్ళకు, ఇద్దరు కొడుకులకు కోడళ్ళకు పిలిపించుకొని మా పల్లెటూరిలో ఆడపిల్లలకు ఆస్తి ఇవ్వరు, దాని విలువ చేసే డబ్బు కూడా ఇవ్వరు. కేవలం సంవత్సరంలో ఒకసారి ఏదో ఒక పండుగ రోజు క్రొత్త బట్టలు పట్టిస్తారు. కనుక ఆడబిడ్డలకు ఇవ్వము. ఇద్దరు కొడుకులకే ఇస్తాము అంటూ వెంటనే వాళ్ళకు రెండు భాగాలు చేసి బాండు పేపరుపై సంతకం పెట్టినాడు. ఇంకా రిజిస్ట్రేషన్ చెయ్యలేదు. ఆడబిడ్డలు కోర్టుకు వెళ్ళి కేసు వెయ్యకుండా వెనుకంజ వేసినారు. పెద్ద అల్లునిగా నేను కేసు వేస్తానంటే అల్లునిది చెల్లదు. బిడ్డకు చెందుతుంది అన్నారు. రెండవ అల్లుడు కేసు వెయ్యను, ఆస్థి వద్దంటున్నాడు. పెద్ద అల్లునిగా నేను వదలను. కనుక నేను కేసు వేస్తే చట్టం ప్రకారం ఆస్తివస్తుందా, రాదా తెలుపగలరు.

మస్తాన్ వలి
కర్నూలు.

తండ్రి ఆస్తిలో కొడుకులతో సమానంగా కూతుళ్ళకు హక్కు ఉంటుంది. ఆ ఆస్తి వారసత్వం అయితే వాళ్ళకు చెందుతుంది. స్వార్జితం అవుతే తనకిష్టమైన వాళ్ళకే ఇచ్చుకోవచ్చు. దానిని అడిగే హక్కు ఎవరికీఉండదు. పంచడంకోసం ఆడ, మగ పిల్లల్ని పిలిచాడంటే ఆడాళ్లకు కూడా ఎంతోకొంత ఇద్దామని పిలిపించి ఉంటాడు. కాని అక్కడ పరిస్థితులలో ఎందుకు అలా చేసాడో ఆలోచించండి. మీ భార్యకు హక్కు ఉంటే ఆవిడే చూసుకుంటుంది. మీకు మాత్రం దాంట్లో హక్కు ఉండదు.

అటాచ్‌మెంట్ అడగండి

ఒక ఉద్యోగికి అప్పు ఇచ్చి ప్రాంసరీనోట్ వ్రాయించుకున్నాను. నోటు వాలిడేషన్‌లోనే ఉంది. ఆ ఉద్యోగి ప్రస్తుతం వి.ఆర్.ఎస్ పెట్టే ఆలోచనలో ఉన్నాడు. వి.ఆర్.ఎస్ కారణంగా అతనికి వచ్చే డబ్బును (ఏ భాగంలో) ప్రాంసరీనోటు దావా ద్వారా తీసుకునే అవకాశం ఉందా? ఈ సమయంలో కోర్టులో కేసు వేయవచ్చా?

ఎన్.వాణి
తెనాలి.

మీరు వెంటనే దావా వేయవచ్చు. దావాలో అతడి వి.ఆర్.ఎస్ గురించి వాస్తవాలు వివరిస్తూ రిటైర్డ్ తరువాత అతడు చెల్లించలేడని, జడ్జిమెంటుకు ముందే అటాచ్‌మెంటుకు అడగవచ్చు.

ఉగ్గాణి

కావలసిన వస్తువులు:

మరమరాలు	:	నాలుగు గ్లాసులు
టమాటా	:	ఒకటి
నిమ్మకాయ	:	ఒకటి
కరివేపాకు	:	రెండు రెబ్బలు
పచ్చిమిర్చి	:	మూడు
నూనె	:	రెండు స్పూన్లు
కొత్తిమీర	:	ఒక కట్ట
ఉల్లిపాయ	:	ఒకటి
తాలింపుగింజలు	:	తగినన్ని
ఉప్పు	:	తగినంత

తయారుచేసే విధానం: టమాటా, ఉల్లిపాయ, పచ్చిమిర్చి, కొత్తిమీర, కరివేపాకు సన్నగా తరగాలి. మరమరాలు నీళ్ళలో పోసి గట్టిగా పిండి ఒక గిన్నెలో పెట్టుకోవాలి. పొయ్యి మీద బాండీ పెట్టి నూనె కాగనివ్వాలి. నూనె కాగాక తాలింపు గింజలు వేయాలి. ఉల్లిపాయలు, టమాటా, పచ్చిమిర్చి ముక్కలు వేసి వేగనివ్వాలి. వేగాక పిండిని మరమరాలు, ఉప్పు వేసి కలపాలి. పైన నిమ్మకాయ రసం పిండి దించి వేయాలి. కొత్తిమీర, కరివేపాకుతో పైన అలంకరించాలి. ఇది వేడి మీద తింటే బాగుంటుంది.

కొబ్బరి తీపి బజ్జీ

కావలసిన వస్తువులు:

పచ్చి కొబ్బరి తురుము	:	మూడు కప్పులు
బియ్యం	:	ఒక కప్పు
పంచదార	:	నాలుగు కప్పులు
వంటసోడా	:	అర టీ స్పూన్
ఉప్పు	:	పావు టీ స్పూన్
యాలకుల పొడి	:	ఒక టీ స్పూన్
నూనె	:	వేయించడానికి

తయారుచేసే విధానం: ముందుగా బియ్యాన్ని 10 గంటలు నానబెట్టుకోవాలి. మూడు కప్పుల పచ్చికొబ్బరి తురుము, నానిన బియ్యం మెత్తగా గ్రైండ్ చేసుకోవాలి. ఏ మాత్రం బరకగా ఉన్నా స్వీట్ బాగుండదు. మెత్తగా పేస్టులా రుబ్బుకొని పిండిలో చిటికెడు ఉప్పు, వంటసోడా,యాలకుల పొడి కలిపి బజ్జీల పిండి మాదిరిగా కలిపి పెట్టి, స్టౌపై పాత్ర పెట్టి పంచదార పోసి రెండు కప్పుల నీళ్ళుపోసి తీగ పాకం పట్టి ఉంచుకోవాలి. నూనె వేడి చేసి పిండిని బజ్జీల మాదిరిగా వేయించి తీసి వెంటనే పాకంలో వేయాలి. పది నిముషాల్లో బజ్జీలు పాకం బాగా పీల్చుకుంటాయి. బజ్జీలు బాగా పొంగి రుచిగా ఉంటాయి.

కలం స్నేహం

హాయ్ చిన్నారి నేస్తాలూ!

మీక్కూడా వీళ్లలాగా కలం స్నేహం చెయ్యాలని వుందా? మరి ఆలస్యం ఎందుకు? ఒక పోస్ట్‌కార్డు తీసుకుని మీ పేరు, వయసు, తరగతి, స్కూలు, హాబీలు, చిరునామా రాయండి. ఆ తర్వాత మీ కలర్ ఫొటోను అతికించి పోస్టు చెయ్యండి. అంతే ఎంచక్కా ప్రచురిస్తాం. అన్నట్టు, ఈ పుస్తకాన్ని మీ స్నేహితులకూ చూపించి అన్ని విషయాలూ చెప్పండి. వాళ్లకు కూడా కలం స్నేహం చెయ్యాలని వుంటే కార్డు మీద రాసి మాకు పంపమనండే. మరి మా అడ్రస్: **కలం స్నేహం**, బాలనేస్తాలు, ప్రజాశక్తి, స్ట్రీట్ నెం.1, అశోక్‌నగర్, హైదరాబాదు.

పేరు : ఫౌజియా ఫాతిమా
వయసు: 11 సం॥
చదువు: 7వ తరగతి
హాబీలు: ప్రజాశక్తి చదవడం, మంచి మార్కుల కోసం ఉత్సాహం చూపడం.
లక్ష్యం: టీచర్ కావడం
చిరునామా:
ఫౌజియా ఫాతిమా,
7వ తరగతి, ఇఖ్రా మోడల్ స్కూల్,
కోటగిరి (పోస్ట్ & మం),
నిజామాబాద్ జిల్లా. **పిన్:** 503 207.

పేరు : టి.నరేష్
వయసు : 9 సం॥
చదువు: 2వ తరగతి
హాబీలు: క్రికెట్ ఆడడం, చదవడం
లక్ష్యం: డాక్టర్ కావడం
చిరునామా:
టి.నరేష్,
సన్నాఫ్ జయమ్మ,
మల్దకల్ (మం), గద్వాల (తాలూకా),
మహబూబ్‌నగర్ జిల్లా.

పేరు : సుక్క చిన్న లింగస్వామి
వయసు: 15 సం॥
చదువు: 10వ తరగతి
హాబీలు: చదవడం, జోక్స్ వేయడం, చెస్, క్రికెట్ ఆడడం, న్యూస్ చూడడం.
చిరునామా:
సుక్క చిన్న లింగస్వామి,
సన్నాఫ్ దశరథ,
పంతంగి (గ్రా),
చౌటుప్పల్ (మం), నల్గొండ జిల్లా.
పిన్: 508 252.

పేరు : ఎస్.కె.రజియా
వయసు: 13 సం॥
చదువు: 8వ తరగతి
హాబీలు: ప్రజాశక్తి పేపరు చదవడం, చదరంగం ఆడడం.
స్కూల్: జడ్.పి.హైస్కూల్
చిరునామా:
ఎస్.కె.రజియా,
డాటరాఫ్ బామిజి,
జగదాంబ బోంబనా వెనుక,
విశాఖపట్నం.

పేరు : టి.సత్యమ్మ
వయసు : 12 సం॥
చదువు: 6వ తరగతి
హాబీలు: బొమ్మలు గీయడం, టీవీ చూడడం. చదవడం.
లక్ష్యం: టీచర్ కావడం
చిరునామా:
టి.సత్యమ్మ
డాటరాఫ్ జయమ్మ,
మల్దకల్ (పోస్ట్ & మం),
మహబూబ్‌నగర్ జిల్లా.

పేరు : పెరుమండ్ల నవీన్‌కుమార్
వయసు : 7 సం॥
చదువు: 2వ తరగతి
హాబీలు: చదవడం, అల్లరి చేయడం, డాన్స్ చేయడం, జోక్స్ వేయడం, టీవీ చూడడం.
చిరునామా:
పెరుమండ్ల నవీన్‌కుమార్,
సన్నాఫ్ చంద్రశేఖర్,
హౌస్ నెం: 2-8-100, ఇందిరానగర్,
భువనగిరి, నల్గొండ జిల్లా.

పేరు : వి.సతీష్
వయసు : 10 సం॥
చదువు: 4వ తరగతి
హాబీలు: ఆదివారం అనుబంధం, చిన్నారి చదవడం, క్రికెట్ ఆడడం, టీవీ చూడడం.
స్కూల్: కేంబ్రిడ్జి స్కూల్
లక్ష్యం: కలెక్టర్ కావడం
చిరునామా:
వి.సతీష్, సన్నాఫ్ సన్యాసినాయుడు,
తిమిడి, ఎస్.కోట (మం),
విజయనగరం జిల్లా.

పేరు : కె.అఖిల
వయసు : 6 సం॥
చదువు : యు.కె.జి
హాబీలు: చెల్లితో ఆడడం, చదువుకోవడం.
చిరునామా:
కె.అఖిల,
డాటరాఫ్ నాగేష్,
ఇంటి నెం: 9-73,
మల్దకల్ (పోస్ట్ & మం),
మహబూబ్‌నగర్ జిల్లా.